ప్రజాశక్తి

బుధవారం 22 మే 2024

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

మామిడి రైతు కుదేలు



నక్కపల్లిలో కాయలు కానరాని మామిడి చెట్టు

తగ్గిన దిగుబడి
ఎకరాకు రూ.లక్షకుపైగా నష్టం

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి, నక్కపల్లి విలేకరి

ఈ ఏడాది మామిడి రైతు కుదేలయ్యాడు. ఎకరాకు కనీసంగా లక్ష రూపాయల ఆదాయం కోల్పోయాడు. ప్రతికూల వాతావరణ పరిస్థితులతో మామిడి దిగుబడి మూడు టన్నుల నుంచి టన్నుకు పడిపోయింది. జిల్లాలో 25 వేల నుంచి 30 వేల ఎకరాల వరకు రైతులు మామిడి తోటలు పెంచారు. 16 వేల మంది రైతులు మామిడి సాగు చేస్తున్నట్లు ఉద్యానవన శాఖ అంచనా. ప్రధానంగా నక్కపల్లి, కోటవురట్ల, పాయకరావుపేట, ఎస్.రాయవరం, కె.కోటపాడు, సబ్బవరం మండలాల్లో మామిడి తోటలు ఎక్కువగా ఉన్నాయి. ప్రతియేటా ఎకరాకు మూడు నుంచి నాలుగు టన్నులు మామిడి కాయల దిగుబడి వచ్చేది. ఈ ఏడాది ఆ దిగుబడి టన్నుకు పడిపోయింది. ప్రస్తుతం మార్కెట్‌లో టన్ను బంగినపల్లి మామిడి రకం రూ.40 నుంచి రూ.50 వేలు, సువర్ణరేక, ఇతర రసాలు కాయల పరిమాణాన్ని బట్టి రూ.60 నుంచి రూ.70 వేల ధర ఉంది. ధర ఉన్నప్పటికీ దిగుబడి తగ్గడంతో రైతులు నష్టపోయారు.

గతేడాది ఖరీఫ్‌లో వర్షాభావ పరిస్థితులు, డిసెంబర్‌లో మిచౌంగ్ తుపానుతో మిగతా 2లో..

3 ఎకరాల తోట ఉన్నా.. ఏ చెట్టూ కాయలేదు



నాకు మూడు ఎకరాల మామిడి తోట ఉంది. ఈ ఏడాది ఏ చెట్టూ కాయలేదు. తోట దున్నేందుకు, ఎరువులు, క్రిమి సంహారక మందులకుగాను సుమారు రూ.25 వేల వరకూ పెట్టుబడులు పెట్టాను. ఫలితం రాలేదు. ఆర్థికంగా తీవ్ర నష్టం వాటిల్లింది. ఏడాదికి ఒకసారి వచ్చే ఫల సాయం కోసం ఎదురుచూసినప్పటికీ తీవ్ర నిరాశే మిగిలింది.

దేవరపు శివ, రైతు, కాగిత, నక్కపల్లి



ధర్నా చేస్తున్న ఉక్కు కార్మికులు

జీతాల కోసం ఉక్కు కార్మికుల ధర్నా

ప్రజాశక్తి - ఉక్కునగరం : తమకు పూర్తి స్థాయిలో జీతాలు చెల్లించాలంటూ స్టీల్‌ప్లాంట్ కార్మికులు మంగళవారం ఆందోళనకు దిగారు. కర్మాగారంలోని కోకో ఒవెన్, సింటర్ ప్లాంట్, ఆర్‌ఎంహెచ్‌పి, బ్లాస్ట్ ఫర్నేస్, ఎస్ఎంఎస్, మిల్స్, ఆక్సిలరీ షాప్స్ విభాగాధిపతుల కార్యాలయాల ఎదుట ఉక్కు కార్మిక సంఘాల ఆధ్వర్యాన పెద్దపెట్టున నినదిస్తూ ధర్నాలు చేశారు. స్టీల్ సిఐటియు నేతృత్వం వహించింది. ఈ సందర్భంగా స్టీల్ సిఐటియు గౌరవాధ్యక్షులు జె.అయోధ్యరాం మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ కార్మికులకు తక్షణమే వేతనాలు చెల్లించాలని యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. ప్లాంట్ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా స్టీల్ యాజమాన్యం కార్మికులపై కక్ష సాధింపు చర్యలకు దిగుతోందని విమర్శించారు. కార్మికులకు న్యాయంగా రావాల్సిన వేతనాలను ఆలస్యం చేసి వారిని ఆందోళనకు గురిచేస్తోందన్నారు. కార్మికులకు వేతనాలు చెల్లించలేని స్థితిలో యాజమాన్యం లేదన్నారు. కావాలనే కుయుక్తులు పన్నుతోందన్నారు. ఇతర కార్మిక సంఘాల నాయకులు మాట్లాడుతూ యాజమాన్యం మొండి వైఖరిని పెద్ద ఎత్తున పోరాటాల ద్వారా ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి

వార్త 3లో..

చెత్తపై యూజర్ ఛార్జీలను వెంటనే రద్దు చేయండి

వార్త 2లో..

సజావుగా టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించాలి

వార్త 8లో..



ఎయు ఇంజినీరింగ్ కాలేజీలోని స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ మల్లికార్జున

స్ట్రాంగ్ రూమ్‌లను తనిఖీ చేసిన కలెక్టర్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఎయు ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఇవిఎంల స్ట్రాంగ్ రూమ్‌లను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున మంగళవారం సాయంత్రం తనిఖీ చేశారు. పార్లమెంటు నియోజకవర్గం స్ట్రాంగ్ రూమ్‌తో పాటు అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన స్ట్రాంగ్ రూమ్‌లను పోలీసు జాయింట్ కమిషనర్ ఫకీరప్పతో కలిసి తనిఖీ చేశారు. ప్రతి గదికీ వేసిన తాళాలను, సీళ్లను పరిశీలించారు. అక్కడ పరిస్థితులను గమనించారు. సీసీ కెమెరాల పనితీరు, వాటి ద్వారా రికార్డయ్యే మానిటరింగ్ రూమ్‌ను తనిఖీ చేశారు. భద్రతా సిబ్బంది, అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వారి వెంట స్వతంత్ర, రాజకీయ పార్టీల అభ్యర్థులు, ఆర్వోలు, ఇతర అధికారులు ఉన్నారు.

అంగన్‌వాడీ యూనియన్ నాయకులు

తులసికి కన్నీటి వీడ్కోలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : గుండెపోటుతో సోమవారం రాత్రి అల్లిపురంలో కన్నుమూసిన ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) విశాఖ జిల్లా అధ్యక్షురాలు వై.తులసి అంత్యక్రియలు మంగళవారం అశ్రు నయనాల నడుమ సాగాయి. కడసారి ఆమెను చూసేందుకు ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి పెద్ద ఎత్తున అంగన్‌వాడీలు, ప్రజా సంఘాల నాయకులు తరలివచ్చారు. తులసి పార్థివదేహం వద్ద నివాళ్లర్పించారు. తులసి అంగన్వాడీల సమస్యల పరిష్కారానికి ఎనలేని కృషి చేశారు. ఈ ఏడాది జనవరిలో ఉధృతంగా సాగిన అంగన్వాడీల సమ్మెకు నాయకత్వం వహించారు. వైసిపి ప్రభుత్వ నిర్బంధాన్ని సైతం లెక్క చేయకుండా ధైర్యంగా నిలబడ్డారు. గతంలో టిడిపి ప్రభుత్వ నిర్బంధాన్నీ ఇదే విధంగా ఎదుర్కొన్నారు. తులసి మృతి విషయం తెలిసిన వెంటనే అంగన్‌వాడీ కార్యకర్తలు, నాయకులు, ప్రజా సంఘాల నేతలు అల్లిపురానికి తరలివచ్చి నివాళ్లర్పించారు. అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు జి.బేబిరాణి, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం, విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, శ్రామిక మహిళా సమన్వయ కమిటీ విశాఖ కన్వీనర్ పి.మణి, పబ్లిక్ మిగతా 2లో..



తులసి (ఫైల్‌ఫొటో)



తులసి పార్థివదేహం వద్ద నివాళ్లర్పిస్తున్న లోకనాథం, బేబిరాణి, కుమార్ తదితరులు

మొదటి పేజీ తరువాయి..

మామిడి రైతు కుదేలు

సకాలంలో పువ్వు రాలేదు. జనవరిలో వచ్చిన పువ్వు అధిక మంచుకు మాడిపోయింది. దీనికితోడు బొడ్డుపుచ్చు, తేనె మంచుతో దిగుబడులు గణనీయంగా తగ్గాయి. మామిడి సీజన్‌లో రోజుకు దాదాపు 800 టన్నుల వరకు చేసిన ఎగుమతులు ఇపుడు 200 టన్నులకు తగ్గాయి. జిల్లాలో పండించిన మామిడి కాయలను వ్యాపారులు కొనుగోలు చేసి, ఏర్పాటు చేసిన పాకల్లో ముగ్గపెట్టి ఢిల్లీ, కొల్‌కతా, ముంబయి, బెంగళూరు, కటక్, బీహార్ సహా పలు రాష్ట్రాలకు ఎగుమతి చేస్తారు. ఈ సంవత్సరం మామిడి పంటకు మంచి గిరాకీ ఉన్నప్పటికీ దిగుబడులు తగ్గడంతో రావాల్సిన ఆదాయం రైతు కోల్పోయాడు. మామిడి కాయలు తీయాల్సిన సమయంలో గాలులు రావడంతో కాయలు రాలిపోయాయి. దీంతో మామిడి రైతుకు మరింత నష్టం వాటిల్లింది. రైతులు ప్రతియేటా సకాలంలో మామిడి కొమ్మలు కత్తిరించి, ఉద్యానవన శాఖ సూచించిన ఎరువులు, పురుగు మందులు పిచికారీ చేస్తే మామిడి దిగుబడిని పెంచవచ్చని అధికారులు చెబుతున్నారు. పూత వచ్చిన తరువాత పురుగులు, తెగుళ్ల నివారణకు నిమ్మకాయ దశ సైజులో మామిడికాయ వున్నపుడు ఫ్రూట్ బ్యాగ్స్ తగిలించి తీయడం ద్వారా నాణ్యమైన కాయలు దిగుతాయని అంటున్నారు

మెళకువలు పాటించాలి



రైతులు మామిడికాయ తీతలో కొన్ని పద్ధతులు పాటించాలి. ముదిరిన తరువాతే చిక్కాలతో తీయాలి. కాయ కిందపడకుండా తీయడంతో వాటి నాణ్యత బాగుంటుంది. మంచి ధర వస్తుంది. ఎటువంటి రసాయనాలూ వినియోగించకుండా, సేంద్రియ పద్ధతుల్లో ముగ్గపెట్టి మార్కెట్, రైతు బజార్లలో అమ్ముకోవాలి. అకాల వర్షాలు, గాలుల బారిన పడకుండా కోయాల్సిన కాయలను గుర్తించి వెంటనే కోసి మార్కెట్ చేసుకోవాలి.

జి.ప్రభాకరరావు, జిల్లా ఉద్యానాధికారి, అనకాపల్లి

తులసికి కన్నీటి వీడ్కోలు

సెక్టార్ కో-ఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ ఎస్.జ్యోతీశ్వరరావు, జివిఎంసి 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు, జివిఎంసి ఎంప్లాయిస్ యూనియన్ గౌరవ అధ్యక్షులు పి.వెంకటరెడ్డి, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర నాయకులు నాగశేషు, కుమారి, సిఐటియు అనకాపల్లి జిల్లా అధ్యక్షులు ఆర్.శంకరరావు తదితరులు నివాళ్లర్పించిన వారిలో ఉన్నారు. తులసి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు. తులసి అంతిమయాత్రలో అంగన్‌వాడీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.దేవి, గౌరవ సలహాదారు బృందావతి, ప్రాజెక్టు లీడర్స్ వెంకటలక్ష్మి, నూకరత్నం, శోభారాణి, పద్మ, లక్ష్మి, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పద్మ, మేరీ, సీతా తదితరులు పాల్గొన్నారు. తులసి ఆకస్మిక మరణం పట్ల ఐద్వా విశాఖ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.పద్మ, వై.సత్యవతి ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. సిపిఐ విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు ఒక ప్రకటన విడుదల చేస్తూ తులసి మంచి నిబద్ధత కలిగిన నాయకురాలు అని కొనియాడారు.



అనకాపల్లిలో నివాళ్లర్పిస్తున్న ఐద్వా నాయకులు

ఐద్వా నివాళి

అనకాపల్లి : తులసి మృతికి అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ప్రగాఢ సంతాపాన్ని తెలియజేసింది. ఈ మేరకు స్థానిక సిఐటియు కార్యాలయంలో మంగళవారం ఐద్వా నాయకులు తులసికి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు బి.ప్రభావతి మాట్లాడుతూ అంగన్వాడీ యూనియన్ విశాఖ జిల్లా అధ్యక్షులుగా అంగన్వాడీలు 42 రోజుల దీక్షలు చేపట్టడంలో తులసి కీలకపాత్ర పోషించారని తెలిపారు. విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాటంలో ఆమె ప్రత్యక్షంగా పాల్గొన్నారని గుర్తు చేశారు.

తులసి మృతికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. కార్యక్రమంలో ఐద్వా విశాఖపట్నం జిల్లా అధ్యక్షులు బి.పద్మ, అనకాపల్లి జిల్లా అధ్యక్షులు పి.మాణిక్యం, సహాయ కార్యదర్శి డిడి.వరలక్ష్మి, ఆర్.లక్ష్మి, జి.సుభాషిణి, కె.శాంతి, విజయ, కృష్ణవేణి, నూకరత్నం, తదితరులు పాల్గొన్నారు.

భెల్ సిఐటియు సంతాపం

గాజువాక : అంగన్‌వాడీ యూనియన్ నాయకులు తులసి మృతి పట్ల భెల్ సిఐటియు నాయకులు సంతాపం తెలిపారు. ఆమె ఆశయాలను కొనసాగిస్తామని నాయకులు జిటిపి.ప్రకాష్, ఎస్.జగన్నాథరావు, కె.నారపరెడ్డి, జి.అచ్చన్నాయుడు, కె.కేశ్వ, జి.రాంబాబు, కె.పవన్ కుమార్ పేర్కొన్నారు.

చెత్తపై యూజర్ ఛార్జీలను వెంటనే రద్దు చేయండి

మేయర్‌కు సిపిఎం ఫ్లోర్ లీడర్ డాక్టర్ బి.గంగారావు లేఖ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : చెత్తపై యూజర్ ఛార్జీలను వెంటనే రద్దు చేయాలని సిపిఎం ఫ్లోర్ లీడర్, జివిఎంసి 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన మంగళవారం మేయర్ గొలగాని హరి వెంకట కుమారికి లేఖ రాశారు. మహా విశాఖ నగర పాలక సంస్థ పరిధిలో చెత్తపై యూజర్ ఛార్జీలు వసూలు చేయాలని వైసిపి పాలక వర్గం చేసిన తీర్మానాన్ని రద్దు చేయాలన్నారు. ప్రతి ఇంటికీ నెలకు రూ.120, మురికివాడల్లో రూ.60 చొప్పున యూజర్ ఛార్జీలు నిర్ణయించారని, వాటిని సిపిఎం ముందు నుంచీ తీవ్రంగా వ్యతిరేకిస్తోందని తెలిపారు. ప్రజల నుంచీ తీవ్రమైన వ్యతిరేకత వ్యక్తమైందన్నారు. అంతేగాకుండా యూజర్ ఛార్జీలు చెల్లించకుండా ప్రజలు నిరసన ఉద్యమం చేపట్టిన విషయాన్ని గుర్తుచేశారు. ఆ తరువాత చెత్తపై యూజర్ ఛార్జీలను ఆస్తి పన్నుతో ముడిపెట్టి రూ.20 నుండి రూ.120 వరకు ఐదు స్లాబులుగా విడగొట్టి మరొక తీర్మానం చేశారని, అయినా ప్రజలు అత్యధిక మంది చెత్తపై యూజర్ ఛార్జీలు చెల్లించటంలేదని తెలిపారు. అధికారులు ప్రజలను బెదిరిస్తున్నా, చెత్త తీసుకెళ్లకపోయినా, ప్రజలపై దౌర్జన్యం చేసినా ప్రజలు చెత్త పన్ను చెల్లించేది లేదని తెగేసి చెబుతున్నారన్నారు. ముఖ్యంగా అపార్ట్‌మెంట్‌వాసులు, మధ్యతరగతి కాలనీ ప్రజలు ఈ ఛార్జీలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని తెలిపారు. ఇప్పటికీ ఛార్జీలు చెల్లించకుండా పోరాటం కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు. ఈ యూజర్ ఛార్జీల ద్వారా వసూలు అవుతున్న సొమ్ము అత్యధిక భాగం అక్రమంగా కొంతమంది స్వాహా చేస్తున్న విషయం తమరికి తెలిసిందేనని మేయర్‌కు గుర్తుచేశారు. అలాగే 2024- 25 ఏడాదిలో చెత్త పన్ను 20 శాతం పెంచటానికి ప్రతిపాదనలు చేస్తున్నట్లు తెలుస్తోందన్నారు. ఇప్పటికే నెలకు ఐదు కోట్ల రూపాయల చెత్త భారం మోపారని. అంతేగాక పెరిగిన ఆస్తి పన్నుతో, ప్రతి ఏడాది 15 శాతం ఆస్తిపన్ను పెంచడంతో ప్రజలు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. నీటి ఛార్జీలు పెంచటానికి, విశాఖ తూర్పు, పశ్చిమ, ఉత్తర నియోజక వర్గాల పరిధిలో మీటర్ల ద్వారా నీటి ఛార్జీలు వసూలుకు సిద్ధమవుతున్నారని తెలిపారు. ఈ చర్యలు ద్వారా నీటి ఛార్జీలు నెలకు రూ.500కు పైగా పెరుగుతాయన్నారు. మురుగు నీటి ఛార్జీ పేర ప్రతి ఇంటి నుండి నెలకు రూ.40 వసూలుకు కూడా సిద్ధమయ్యారన్నారు.

ఈ చర్యలన్నీ విరమించాలని ఆయన తన లేఖలో పేర్కొన్నారు. కావున తక్షణం కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేసి చెత్తపై యూజర్ ఛార్జీలు రద్దు చేస్తూ తీర్మానం చేయాలని సిపిఎంగా డిమాండ్ చేశారు. లేనిపక్షంలో విశాఖ నగర ప్రజలు చెత్తపై యూజర్ ఛార్జీలు చెల్లించరని తెలియజేశారు. ప్రజలపై దౌర్జన్యం, నిర్బంధం, దాడులకు అధికారులను పురికొల్పితే ప్రజల నుండి తీవ్ర ప్రతిఘటన ఎదుర్కోవాల్సి వస్తుందని తెలియజేశారు.

సజావుగా టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : జిల్లాలో ఈ నెల 24 నుంచి జరగనున్న పదో తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలను సజావుగా నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ సంబంధిత అధికారులను ఆదేశించారు. పదో తరగతి సప్లిమెంటరీ, ఎపి సార్వత్రిక విద్యాపీఠం (ఓపెన్ స్కూల్) నిర్వహించే పది, ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలపై మంగళవారం ఉదయం ఆయన ఛాంబరులో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో మే 24 నుంచి జూన్ 3వ తేదీ వరకు పదో తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు జరగనున్నాయని అన్నారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకూ జరిగే ఈ సప్లిమెంటరీ పరీక్షలకు జిల్లావ్యాప్తంగా 4836 మంది విద్యార్థులు హాజరుకానున్నట్లు చెప్పారు. అందులో 2,578 మంది రెగ్యులర్ విద్యార్థులు, 2,258 మంది ప్రైవేటు విద్యార్థులు ఉన్నారని తెలిపారు. పరీక్షల నిర్వహణ కోసం 20 పరీక్షా కేంద్రాలను ఎంపిక చేయడంతో పాటు చీఫ్ సూపరింటెండెంట్లు, శాఖాధికారులు, స్క్వాడ్, రూట్ అధికారులను నియమించినట్టు తెలిపారు. పదో తరగతి మెయిన్ పరీక్షలు మాదిరిగానే సప్లిమెంటరీ పరీక్షలను కూడా పకడ్బందీగా నిర్వహించాలని అన్నారు. విద్యార్థులకు ఎటువంటి సమస్యలూ తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, నిరంతరాయంగా విద్యుత్, తాగునీరు, రవాణా వంటి మౌలిక వసతులను కల్పించాలని ఆదేశించారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలని స్పష్టం చేశారు. అనంతరం ఓపెన్ స్కూల్ పది, ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలపై జెసి మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా పది పరీక్షలకు 2,289 మంది, ఇంటర్ పరీక్షలకు 2,547 మంది విద్యార్థులు హాజరుకానున్నారని తెలిపారు. మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకూ పరీక్షలు జరుగుతాయని, జూన్ 10 నుంచి 12వ తేదీ వరకు ఇంటర్ ప్రాక్టికల్ పబ్లిక్ పరీక్షలు నిర్వహించ బడతాయని వివరించారు. వీటి నిర్వహణ కోసం ఇప్పటివరకూ 9 పరీక్షా కేంద్రాలను గుర్తించామన్నారు. ప్రతి కేంద్రం వద్దా అధికారులను నియమించామని తెలిపారు. సమావేశంలో జిల్లా రెవిన్యూ అధికారి కె.మోహన్ కుమార్, జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ, జివిఎంసి, పోలీస్, ఆర్‌టిసి, వైద్యఆరోగ్యం, రవాణా, తపాలా, విద్యుత్ శాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జెసి మయూర్ అశోక్

రఘురామకృష్ణరాజుకు సత్కారం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఎంపీ కె.రఘురామకృష్ణరాజును తెలుగు శక్తి అధ్యక్షులు బివి.రామ్ మంగళవారం విశాఖ నగరంలో సత్కరించారు. ఈ సందర్భంగా రామ్ మాట్లాడుతూ ట్రిపుల్ ఆర్‌గా ప్రసిద్ధి చెందిన రఘురామకృష్ణరాజు వైసిపి అనుసరించిన ప్రజా వ్యతిరేక విధానాలను తనదైన శైలిలో విమర్శిస్తూ ప్రత్యేక గుర్తింపును పొందారన్నారు. ఆయన భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. రఘురామకృష్ణరాజును కలిసిన వారిలో టిడిపి పార్లమెంటు నియోజకవర్గ కమిటీ కార్యదర్శి బోడేపూడి దొరబాబు, బిసి నాయకులు దువ్వి పరమేశ్వరరావు, పి.వసంతరావు, పి.లక్ష్మణ్ చౌదరి ఉన్నారు.

అప్పుల బాధతో ఉక్కు ఉద్యోగి ఆత్మహత్య

ప్రజాశక్తి - ఉక్కునగరం : అప్పుల బాధతో ఉక్కు ఉద్యోగి టి.చిరంజీవులు (56) మంగళవారం స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్టీల్‌ప్లాంట్ పోలీసుల కథనం మేరకు ఆయన సూసైడ్ నోట్ రాసి ఆత్మహత్య చేసుకున్నాడు. కొన్ని వ్యాపారాలలో పెట్టుబడులు పెట్టి అవి తిరిగి రాక ఇబ్బందులు పడుతున్నట్లుగా ఆ నోట్‌లో చిరంజీవులు తెలిపాడు. ఈ నేపథ్యంలో అప్పుల వాళ్ళ ఒత్తిడి ఎక్కువ కావడంతో మానసిక ఒత్తిడికి గురై చనిపోతున్నట్టు పేర్కొన్నాడు.

క్రీడా మైదానాలేవీ?



క్రీడా మైదానం లేని జివిఎంసి ఉన్నత పాఠశాల

- ఆట వస్తువుల్లేవు
- శారీరక దృఢత్వం, మానసిక ఉల్లాసం కరువు
- ఉన్న చోట నిర్వహణా లోపం
- పలు ప్రభుత్వ పాఠశాలల్లో ఇదే దుస్థితి

ప్రజాశక్తి -భీమునిపట్నం : పాఠమే పాటగా, చదువే ఒక ఆటగా, గురువే విద్యార్థికి చక్కని నేస్తంగా సాగితే విద్యార్థులు మంచి భావి భారత పౌరులుగా ఎదుగుతారని ఎందరో మహానుభావులు చెప్పేవారు. కారణాలు ఏమైనా గానీ నేడు ఆ పరిస్థితి కానరావడం లేదు. విద్యార్థులకు శారీరక దృఢత్వాన్ని, మానసిక ఉల్లాసాన్ని, ఆహ్లాదాన్ని అందించే క్రీడా మైదానాలు పలు పాఠశాలల్లో లేవు. అత్యధిక ప్రైవేట్ పాఠశాలల్లో ఎలాగూ లేవు. ప్రభుత్వ పాఠశాలల్లో సైతం కనుమరుగవుతున్నాయి. పట్టణ, గ్రామీణ ప్రాంతంలో 22 జివిఎంసి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. వీటిల్లో కేవలం ఐదారు జివిఎంసి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లోనే క్రీడా మైదానాలు ఉన్నాయి. విద్యాశాఖ ప్రమాణాల ప్రకారం ప్రతి ఉన్నత పాఠశాలకూ కనీసం 5 ఎకరాల విస్తీర్ణం కలిగిన ఆటస్థలం ఉండాలి. భీమిలి మండలం, జివిఎంసి పరిధిలో ఆ పరిస్థితి దాదాపు లేదనే చెప్పాలి. చిన్న పాటి స్థలంలోనే డ్రిల్ పీరియడ్‌ను అలా కానిచ్చేస్తున్నారు.

భీమిలి, చిట్టివలస, లక్ష్మీపురం, మజ్జివలస, తాటితూరు, తాళ్లవలస, మజ్జిపేట, అమనాం, మంగమారిపేట, పట్టణ పరిధిలోని చిట్టివలస, సంతపేట, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జివిఎంసి ఉన్నత పాఠశాలల్లో మాత్రమే ఆట స్థలాలు ఉన్నాయి. ఇందులో కొన్ని పాఠశాలల్లో పూర్తి స్థాయిలో సరిపడా ఆట స్థలాలు లేవు. ఎపి గురుకుల పాఠశాల, కెజిబివి పాఠశాలల్లో విశాలమైన క్రీడా మైదానాలు ఉన్నాయి. అలానే దాదాపు అత్యధిక ప్రభుత్వ పాఠశాలల్లో క్రీడా సామగ్రి కరువనే చెప్పొచ్చు. ప్రభుత్వం అరకొరగా క్రీడా సామగ్రిని అందిస్తుందని, అది కూడా పరిమిత పాఠశాలలకే అందుతోంది. కొన్ని పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు, పిఇటిల చొరవతో కొంతమంది దాతల సాయంతో క్రీడా సామగ్రి సమకూర్చుకుంటున్న పరిస్థితి ఉంది. క్రీడలపై తమకున్న ఆసక్తితో కొంతమంది విద్యార్థులు పలు క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరుస్తూ ఆయా పాఠశాలలకు మంచి పేరు తెస్తున్నారు. వీరికి ప్రభుత్వ ప్రోత్సాహం తోడైతే మట్టిలో మాణిక్యాలుగా తయారయ్యే అవకాశం ఉందని పలువురు అంటున్నారు.

ప్రజాస్వామ్యం కాదు.. ధనస్వామ్యం : ముర్రు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : దేశంలో ప్రజాస్వామ్యం కానరాలేదని, ధనస్వామ్యమే కనిపించిందని, ఇటీవల జరిగిన ఎన్నికలలో ఇది స్పష్టంగా గోచరించిందని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం పూర్వపు వైస్ ఛాన్సలర్ ముర్రు ముత్యాలనాయుడు ఆవేదన వెలిబుచ్చారు. విజెఎఫ్ ప్రెస్ క్లబ్‌లో మంగళవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, సార్వత్రిక ఎన్నికలలో రెండు ప్రధాన పార్టీల నేతలు పట్టపగలే ఓటర్లకు డబ్బు పంచుతూ ఓట్లు అడిగారని, దీనిని అరికట్టాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. ఓటర్లకు లంచం ఇవ్వడాన్ని సులభతరం చేసే అన్ని అక్రమ డబ్బు లావాదేవీల్ని అరికట్టడం ద్వారా ఎన్నికల ప్రక్రియను సక్రమం చేసేలా ఎన్నికల సంస్కరణలు తేవాలన్నారు. ఈ మేరకు తాను ఇప్పటికే ప్రధాని మోడీ, రాష్ట్రపతి, అన్ని రాజకీయ పార్టీల అధిష్టానాలకు లేఖలు రాశానని తెలిపారు. మొన్నటి ఎన్నికల్లో ఒక్కో ఓటు కనీసం రూ.1500 పలికిందన్నారు. ధన ప్రవాహం లేకుండా ఓటర్లు నిర్భయంగా ప్రజాస్వామ్య బద్ధంగా పోలింగ్‌కు వెళ్లేలా చేయాలనేదే తన ఆకాంక్ష అని పేర్కొన్నారు. ఒక్కొక్క అసెంబ్లీ నియోజకవర్గంలో అభ్యర్థి రూ.50 కోట్లకు పైగా ఖర్చు చేశారని, అలా చూస్తే రాష్ట్రవ్యాప్తంగా సుమారు రూ.8,250 కోట్లు ఖర్చు అయినట్లు వివరించారు. ఇంత ధనం ఎక్కడి నుంచి వచ్చిందని ప్రశ్నించారు. డబ్బు ప్రస్తావన లేకుండా ప్రజల కోసం పరితపించే నాయకుడికి ఓట్లు వేసేలా, ప్రజల కోసం పనిచేసే నాయకుడే విజయం సాధించేలా పరిస్థితి మారినప్పుడు ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతుందని పేర్కొన్నారు. ఇందుకోసం మేధావులు, జర్నలిస్టులు కీలక పాత్ర నిర్వహించాలని పిలుపునిచ్చారు.

గీతం డిగ్రీ, పీజీ సైన్స్ కోర్సుల అడ్మిషన్లు

26న ప్రవేశ పరీక్ష

ప్రజాశక్తి-మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ సైన్స్ ద్వారా నిర్వహిస్తున్న డిగ్రీ, పీజీ కోర్సులలో ప్రవేశానికి ఈ నెల 26వ తేదీన గీతం అడ్మిషన్ టెస్ట్ (గ్యాట్) నిర్వహిస్తున్నట్లు స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ వేదవతి తెలిపారు. స్కూల్ ఆఫ్ సైన్స్ ద్వారా బయోకెమిస్ట్రీ, బయోటెక్నాలజీ, కెమిస్ట్రీ, ఎలక్ట్రానిక్స్, మైక్రోబయాలజీ, ఫిజిక్స్, మేథ్స్, స్టాటిస్టిక్స్, ఫుడ్‌సైన్స్ అండ్ టెక్నాలజీ, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్‌లలో 4 సంవత్సరాల బిఎస్సీ (ఆనర్స్) కోర్సులు, 3 సంవత్సరాల బిసిఎ కోర్సు నిర్వహిస్తున్నామని తెలిపారు. అప్లైడ్ మేథ్స్, బయోకెమిస్ట్రీ అండ్ మాలిక్యులర్ బయాలజీ, డేటా సైన్స్, బయోకెమిస్ట్రీ, బయోటెక్నాలజీ, కెమిస్ట్రీ, ఎలక్ట్రానిక్స్, మైక్రోబయాలజీ, ఫిజిక్స్, స్టాటిస్టిక్స్, ఫుడ్‌సైన్స్ అండ్ టెక్నాలజీ, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్‌లలో 2 సంవత్సరాల ఎమ్మెస్సీ కోర్సులను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. వీటితో పాటు మాస్టర్ ఆఫ్ కంప్యూటర్ అప్లికేషన్స్ (ఎంసిఎ) కోర్సు నిర్వహిస్తున్నామని తెలిపారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా బిఎస్సీ, ఎమ్మెస్సీ కోర్సులను నిర్వహిస్తున్నామని వివరించారు. ఈ కోర్సులలో ప్రవేశానికి మే 24వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. వివరాల కోసం గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపల్ కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు. గ్యాట్ ప్రవేశ పరీక్షకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోదలచిన వారు గీతం వెబ్ సైట్‌ను పరిశీలించాలని కోరారు.

ప్రమాద బాధితునికి ఆర్థిక సహాయం

ప్రజాశక్తి -ఆనందపురం : మండలంలో రామవరం గ్రామ పంచాయతీ ముమ్మనవానిపాలెం గ్రామానికి చెందిన రాజాన దుర్గాప్రసాద్ (18) ఈ నెల 10వ తేదీన తాటిచెట్టు పైనుంచి కింద పడి తీవ్ర గాయాలపాలయ్యాడు. అతనిని వైద్య చికిత్స నిమిత్తం విశాఖ మెడికవర్ హాస్పిటల్‌లో చేర్పించారు. పరిశీలించిన డాక్టర్లు బ్రెయిన్‌కు ఆపరేషన్ చేయాలని, సుమారు రూ.10 లక్షలు ఖర్చు అవుతుందని తెలిపారు. ప్రస్తుతానికి ఆరోగ్య శ్రీ వైద్య సేవలు ఈ చికిత్సకు అందుబాటులో లేవని వైద్యులు చెప్పడంతో అతని తల్లిదండ్రులు గంగమ్మ, అప్పలరాజు ఆందోళన చెందారు. రోజు కూలి పనులు చేసుకునే తమకు అంత స్థోమత లేదంటూ విలపించారు. తమ బిడ్డను బతికించుకోడానికి దాతలు సహకరించాలని కోరారు. దీనికి స్పందించిన రామవరం గ్రామానికి చెందిన జి.హర్షిణి తన మిత్ర బృందం గ్రామస్థాయిలో మొదలుపెట్టి చుట్టుపక్కల గ్రామాల నుంచి విరాళాల సేకరణ చేపట్టారు. సుమారు రూ.2లక్షలు సేకరించి దుర్గాప్రసాద్ తల్లిదండ్రులకు అందించారు. దాతలు అందించిన విరాళానికి బాధితుని తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.



బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందిస్తున్న హర్షిణి మిత్రబృందం

మెడికవర్‌లో అధునాతన శస్త్రచికిత్స



కోలుకున్న రోగితో వైద్యబృందం

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : మెడికవర్ ఆసుపత్రిలో 76 ఏళ్ల సుబ్రహ్మణ్యానికి అధునాతన రోబోటిక్ శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించినట్లు గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డాక్టర్ బిబి.దాస్ తెలిపారు. సుబ్రహ్మణ్యానికి తరచూ కామెర్లు రావడంతో మెరుగైన వైద్యం కోసం విశాఖపట్నంలోని మెడికవర్ హాస్పిటల్స్‌కు వచ్చారని వివరించారు. అతనికి తగిన పరీక్షలు నిర్వహించిన తర్వాత ప్యాంక్రియాటిక్ (క్లోమ గ్రంధి) వద్ద కణితి కారణంగా తరచూ కామెర్లు వస్తున్నాయని గుర్తించినట్లు తెలిపారు. ఇటువంటివాటికి సాధారణంగా శస్త్రచికిత్స చేస్తాం కానీ అతని వయసు రీత్యా రోబోటిక్ సర్జరీని ప్రతిపాదించామని చెప్పారు. ఇది చాలా ఖచ్చితత్వంతో మెరుగైన ఫలితాలు అందిస్తుందన్నారు. అధునాతన రోబోటిక్స్ శస్త్రచికిత్స ద్వారా కణితిని తొలగించినట్లు వివరించారు. రోగి తన రోజువారీ కార్యకలాపాలను 3వ రోజు నుంచి తిరిగి ప్రారంభించారని తెలిపారు. ఇటువంటి వాటికి ఓపెన్ సర్జరీ (పెద్ద కోత) చేయాలని, దీనివల్ల చాలా రక్తం పోవడం వల్ల పేషెంట్ ఎక్కువ రోజులు హాస్పిటల్‌లో ఉండాల్సి వస్తుందని తెలిపారు. కోలుకోవడానికి కూడా ఎక్కువ సమయం (నెలలు) పడుతుందన్నారు. ఈ రకమైన సంక్లిష్ట సర్జరీలకు రోబోటిక్స్‌తో మంచి ఫలితాలను అందుకోవచ్చని తెలిపారు. ఈ విధానం శారీరక గాయాన్ని తగ్గించడమే కాకుండా రికవరీ ప్రక్రియను వేగవంతం చేస్తుందన్నారు. రోగులు వారి రోజువారీ కార్యక్రమాలను త్వరగా ప్రారంభించేందుకు వీలు కల్పిస్తుందని వివరించారు.

నేరాలు ఘోరాలు



ప్రమాదంలో మృతి చెందిన వినయ్

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి

ప్రజాశక్తి-యంత్రాంగం

నక్కపల్లి : మండలంలోని ఉద్దండపురం జాతీయ రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందగా ,మరొకరు తీవ్రంగా గాయపడ్డారు.విశాఖపట్నం, ఎన్ఎడి కొత్త రోడ్డు, బుచ్చిరాజుపాలేనికి చెందిన తెంటూ సాయికిరణ్ దుర్గేష్ (24) బైక్‌పై ఏలూరు బంధువుల ఇంటికి వెళ్లాడు. మంగళవారం ఉదయం తిరిగి వస్తూ రాజమండ్రిలో ఉంటున్న విజ్ఞాన్ ఇంజనీరింగ్ కాలేజ్ స్నేహితుడు తిప్పట్లా వినయ్ (25) ఇంటికి వెళ్లాడు.తన స్నేహితుడు వినయ్‌తో కలిసి సాయికిరణ్ దుర్గేష్ స్వగ్రామం బయలుదేరాడు. ఉద్దండపురం వద్దకు వచ్చేసరికి రేబాక, గుల్లిపాడు మీదగా వస్తున్న ప్రైవేటు బస్సు అతివేగంగా వచ్చి బైకును ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో బైక్ డ్రైవింగ్ చేస్తున్న వినయ్ తలకు తీవ్ర గాయమై మృతి చెందాడు. సాయికిరణ్ దుర్గేష్‌కు ఎడమ కాలుకు బలమైన గాయమైంది .108 వాహనంలో తుని ఏరియా ఆసుపత్రికి తరలించారు .తీవ్రంగా గాయపడ్డసాయికిరణ్ దుర్గేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ విజయ్‌కుమార్ వెల్లడించారు

విశ్రాంత ఉద్యోగి మృతి

తగరపువలస : స్థానిక వలందపేట సర్వీస్ రోడ్డు వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో భీమిలి మండలం ఆర్.తాళ్లవలస గ్రామానికి చెందిన డి.వెంకటపతిరాజు (64) మృతి చెందారు. ఇతను పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందారు. పోలీసుల కథనం ప్రకారం.. వెంకటపతి రాజు స్కూటీపై పూజ సామగ్రి కోసం సంగివలస వచ్చి తిరుగు ప్రయాణంలో తాళ్లవలస వెళ్తుండగా, ఎదురుగా వస్తున్న కారు వలందపేట సర్వీస్ రోడ్డు వద్ద స్కూటీని బలంగా ఢీకొంది. స్కూటీతో పాటు అతన్ని కొద్ది దూరం లాక్కుపోయింది. దీంతో తీవ్ర గాయాలైన అతను అక్కడికక్కడే మృతి చెందారు. మృతుని కుమార్తె సాయిలక్ష్మి ఫిర్యాదు మేరకు భీమిలి ఎస్ఐ జి.హరీష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కొట్లాట కేసులో ఐదుగురికి రిమాండ్

ప్రజాశక్తి -ఆనందపురం : మండలంలో బంటుపల్లి వారి కల్లాలులో ఈ నెల 19వ తేదీ అర్ధరాత్రి మద్యం మత్తులో మందుబాబులు వీరంగం సృష్టించారు. రౌడీ షీటర్ కొట్టాన గణేష్, మరో నలుగురు మద్యం తాగరు. కొంత సమయం తర్వాత వీరి మధ్య వివాదం తలెత్తింది. కొట్టుకున్నారు. దీంతో చందక గ్రామానికి చెందిన రెడ్డి గురునాయుడుకు బలమైన గాయాలయ్యాయి. స్థానిక పోలీస్ స్టేషన్‌కు అందిన సమాచారం మేరకు ఆనందపురం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ తిరుపతిరావు ఆధ్వర్యాన సంఘటనా స్థలానికి చేరుకున్న ఆనందపురం పోలీసులు ఐదుగురిని అరెస్టు చేశారు. వారికి విశాఖ స్పెషల్ సెషన్ కోర్ట్ జడ్జి 14 రోజులపాటు రిమాండ్ విధించారు.

జానపద కళాకారుడు చిన్నరెడ్డికి సత్కారం

ప్రజాశక్తి -తగరపువలస : భీమిలి మండలం తాటితూరు గ్రామానికి చెందిన ప్రముఖ జానపద కళాకారుడు సరగడ చిన్నరెడ్డిని పలువురు ఘనంగా సత్కరించారు. తాడేపల్లిగూడెంలోని బివిఆర్ కన్వెన్షన్ హాల్లో ఈ నెల 19న జాతీయ స్థాయి నృత్య, జానపద, నాటికల పోటీలు నిర్వహించారు. పలువురి కళాకారులతో భరతనాట్యం, కూచిపూడి, కథక్ నృత్య ప్రదర్శనలు జరిగాయి. రైతు నృత్య రూపకం ప్రదర్శించినందుకు సరగడ చిన్నరెడ్డిని నిర్వాహకులు ఘనంగా సత్కరించి అభినందించారు.



చిన్నరెడ్డిని సత్కరిస్తున్న నిర్వాహకులు



వ్యర్థ పదార్థాలతో కళాకృతులను తయారు చేసిన విద్యార్థులు

ఉత్సాహంగా కళాకృతుల తయారీ

ప్రజాశక్తి -ములగాడ : వ్యర్థ పదార్థాల నుంచి విలువైన వస్తువులను తయారుచేసే కళాకృతుల వర్క్‌షాపును మంగళవారం మల్కాపురంలోని శాఖా గ్రంథాలయంలో నిర్వహించారు. వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా ఏర్పాటుచేసిన ఈ వర్క్‌షాప్‌నకు జాతీయ సేవా పథకం సీనియర్ ప్రోగ్రామ్ అధికారి వై.అనసూయాదేవి రిసోర్స్ పర్సన్‌గా వ్యవహరించి కాగితాలతో, వివిధ రకాల వ్యర్థ పదార్థాలతో కళాకృతులను తయారు చేయడంలో బాలలకు శిక్షణ ఇచ్చారు. వివిధ రకాల పువ్వులను, బొమ్మలను, అలంకరణ వస్తువులను బాలలు తయారు చేశారు. ఇటువంటి చేతివృత్తులలో శిక్షణ ఇవ్వడం వల్ల బాలల్లో ఆసక్తి కనబడుతుందని, నైపుణ్యాలు పెరుగుతాయని, పరిశీలన శక్తి, సృజనాత్మకశక్తి బయటకు వస్తాయని రిసోర్స్ పర్సన్ అనసూయాదేవి తెలిపారు. అనంతరం బాలలంతా తయారు చేసిన వివిధ వస్తువులను, కళాకృతులను ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి జాతీయ సేవా పథకం జిల్లా ప్రోగ్రాం అధికారి ఇపిఎస్.భాగ్యలక్ష్మి, గ్రంథాలయాధికారి వి.అజయ్‌కుమార్ సారథ్యం వహించారు. కార్యక్రమం అనంతరం బాలలంతా దేశభక్తి గేయాలను ఆలపించారు. అంతకుముందు ఫార్మసీ విద్యార్థి జాన్ ఆధ్వర్యాన బాలలకు సైన్స్ ప్రయోగాలపై శిక్షణ ఇచ్చారు.



రవివర్మకు నియామకపత్రం అందిస్తున్న ప్రసాదరావు

ఐహెచ్‌ఆర్‌సి సౌత్ ఇండియా ఇన్‌ఛార్జిగా రవివర్మ

ప్రజాశక్తి-వేపగుంట : ఐహెచ్‌ఆర్‌సి సౌత్ ఇండియా ఇన్‌ఛార్జిగా ప్రముఖ సామాజికవేత్త రవి వర్మ నియమితులయ్యారు. నాయుడుతోటలోని ఇండో హ్యూమన్ రైట్స్ కేర్ ప్రధాన కార్యాలయంలో రవి వర్మకు మంగళవారం నియామక పత్రం, గుర్తింపు కార్డును నేషనల్ ఛైర్మన్ రాజాన ప్రసాదరావు అందించారు. ఈ సందర్భంగా రాజాన ప్రసాదరావు మాట్లాడుతూ సమాజం, దేశం పట్ల సేవా భావం కలిగి ఉండాలని, మానవ హక్కులను తెలియజేస్తూ వాటిని కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో నేషనల్ అడ్వైజర్ కమిటీ సభ్యులు మధు, జె.రాజు, ఏపీ, తెలంగాణ స్పోర్ట్స్ అడ్వైజర్ పి.మురళి, ఏపీ స్టేట్ ప్రెసిడెంట్ వై.శ్రీనివాస్, సెక్రటరీ ఆర్ వెంకట్రావు, విశాఖపట్నం జిల్లా వైస్ ప్రెసిడెంట్ బి.రమేష్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

వైభవంగా పరదేశమ్మ పండగ

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి 42వ వార్డు పరిధి తాటిచెట్లపాలెంలో పరదేశమ్మ అమ్మవారి పండగ మహోత్సవాన్ని మంగళవారం వైభవంగా నిర్వహించారు. అమ్మవారిని ఉత్తర నియోజకవర్గం వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి కెకె రాజు దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పైడి రమణ, ఆళ్ల శివ గణేష్, పోలారావు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పోలమాంబ జాతర

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : జివిఎంసి 22వ వార్డు పరిధి పీతలవానిపాలెం, శివాజీపాలెం గ్రామ దేవత పోలమాంబ అమ్మవారి జాతర మంగళవారం అంగరంగ వైభవంగా జరిగింది. వేకువజాము నుంచి విశేష పూజలు, అర్చనలు కుంకుమార్చనలు అర్చకులు నిర్వహించారు. విశాఖ ఎంపీ, తూర్పు నియోజకవర్గం వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవివి సత్యనారాయణ అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో 22వ వార్డు వైసిపి అధ్యక్షుడు పీతల గోవింద, మత్స్యకార వైసిపి నాయకుడు గంపల వెంకట రామచంద్రరావు, చొక్కార శేఖరరావు పాల్గొన్నారు.

ముందుచూపు లేక వృథా



పాత ఈతకొలనులో నింపుతున్న మట్టి

చోటు మారిన ఈత కొలను
లక్షల రూపాయలు నేలపాలు

ఈత కొలను కోసం వెచ్చించిన నిధులు నేలపాలైనట్లేనని స్థానికులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. అధికారులు వీలైనంత తొందరలోగా ఈ ఈత కొలనునైనా వినియోగంలోకి తేవాలని స్థానికులు కోరుతున్నారు. దీనిపై ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ప్రసాద్‌బాబు మాట్లాడుతూ, ఆధునిక వసతులతో ప్రస్తుతం కొత్త ఈత కొలను నిర్మాణం జరుగుతుందన్నారు. పాత ఈత కొలను స్థలంలో సచివాలయ భవనం నిర్మాణం జరుగుతాయని తెలిపారు.

ప్రజాశక్తి -గాజువాక : గత పాలకుల వైఫల్యం, అప్పుడున్న ఇంజినీరింగ్ అధికారుల ముందు చూపు లేమి కారణంగా లక్షలాది రూపాయలు నేలపాలయ్యాయి. జివిఎంసి 65వ వార్డు పరిధి వికాస్‌నగర్‌లో 2010 సంవత్సరంలో ఈత కొలను కోసం రూ.16 లక్షలను అప్పటి మేయర్ పులుసు జనార్దనరావు కేటాయించారు. దీనికి సంబంధించి పనులు కూడా కొంతవరకు జరిగాయి. తర్వాత వచ్చిన ఎమ్మెల్యేలు పట్టించుకోకపోవడం, కొత్తగా కౌన్సిల్ ఏర్పడ్డాక ఈ పనులు మూలనపడ్డాయి. మరలా జివిఎంసి కౌన్సిల్ ఏర్పడడంతో ఈ ఈత కొలను ప్రస్తావన వచ్చింది. ప్రస్తుత పరిస్థితుల్లో ఈ ఈతకొలను అంత సౌలభ్యం కాదని నిర్ణయించారు. రాజీవ్‌నగర్ స్టేడియం వద్ద ఈతకొలను, స్నానపు గదుల కోసం రూ.ఐదు కోట్లు కేటాయించి పనులు చేపట్టారు. పాత ఈత కొలను ప్రాంతంలో సచివాలయ భవనాల నిర్మాణం చేపడతామని అధికారులు చెబుతున్నారు. దీంతో అప్పట్లో



కొత్తగా నిర్మిస్తున్న ఈతకొలను

రైల్వే వ్యాగన్ వర్క్‌షాప్ వర్కర్ల సమస్యలపై ధర్నా



వడ్లపూడి రైల్వే వ్యాగన్ రిపేర్ వర్క్‌షాపు వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు

ప్రజాశక్తి -గాజువాక : వడ్లపూడి రైల్వే వ్యాగన్ వర్క్ షాప్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, యాజమాన్యం కార్మికుల మధ్య గతంలో కుదిరిన ఒప్పందం అమలు చేయాలని కోరుతూ కార్మికులు మంగళవారం వర్క్‌షాపు ముందు ధర్నా చేశారు. ఈ ధర్నానుద్దేశించి ఈస్ట్ కోస్ట్ రైల్వే కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ (సిఐటియు) గౌరవాధ్యక్షులు ఎం.రాంబాబు మాట్లాడుతూ, ఒప్పందం జరిగి నాలుగు నెలలు గడుస్తున్నా అమలు చేయడం లేదన్నారు. యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరించడాన్ని సిఐటియు తీవ్రంగా ఖండిస్తోందన్నారు. ఒప్పందాన్ని అమలు చేయకపోతే నిరవధిక సమ్మె చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు కె.అవతారం, ప్రధాన కార్యదర్శి వి.రాజు, వైస్ ప్రెసిడెంట్ వెంకటేశ్వరరావు, సురేష్, రాజు, సతీష్, రమేష్, రామకృష్ణ, ఎస్.రాజు పాల్గొన్నారు.

ఎస్‌సి, ఎస్‌టి లైజన్ ఆఫీసర్‌కు సత్కారం



రాధికను సత్కరిస్తున్న ఎస్‌సి, ఎస్‌టి అసోసియేషన్ నాయకులు

ప్రజాశక్తి -ఉక్కునగరం : స్టీల్‌ప్లాంట్ ఎస్‌సి, ఎస్‌టి లైజన్ ఆఫీసర్‌గా నియమితులైన రాధికను ఎస్‌సి, ఎస్‌టి ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు బొండా తాతన్న, బి.మల్లయ్య ఆధ్వర్యాన ఎస్‌సి, ఎస్‌టి సెల్ ఇన్‌ఛార్జి భాను సత్కరించారు. అనంతరం ఎస్‌సి, ఎస్‌టి కార్మికుల దీర్ఘకాలిక సమస్యలపై చర్చించారు. యాజమాన్యంతోను, ఎస్‌సి, ఎస్‌టి కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని రాధిక హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు ఎల్‌వి.రమణ, ఎస్.సత్యనారాయణ, కెవి.రత్నం, మోహన్‌బాబు, వేణుగోపాల్, ఫణీంద్రబాబు, గణేష్, బిడి.నాయక్, సువర్ణరాజు, మహేష్, బాలకృష్ణ, సాయిప్రసాద్, చింతా మోహన్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో కూటమికే అధికారం

ఎంపీ రఘురామకృష్ణరాజు

ప్రజాశక్తి-సీతమ్మధార : రాష్ట్రంలో టిడిపి, జనసేన, బిజెపి కూటమి అధికారం చేపడుతుందని, చంద్రబాబు ముఖ్యమంత్రి అవుతారని ఎంపీ రఘురామకృష్ణరాజు పేర్కొన్నారు. సీతమ్మధారలోని కెఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో ఉత్తర నియోజకవర్గం ముఖ్య నాయకులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్రం అభివృద్ధి చెందాలని ప్రజలందరూ కోరుకున్నారని, కూటమి అభ్యర్థులకు ఓటువేశారని తెలిపారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా రాష్ట్రం అభివృద్ధికి కృషిచేస్తారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సహాయ సహకారాలు కూడా ఉంటాయన్నారు. ఈ సమావేశంలో ఉత్తర నియోజకవర్గ కూటమి అభ్యర్థి విష్ణుకుమార్‌రాజు, ఎన్నికల పరిశీలకులు నజీర్, ఎమ్మెల్సీ రఘువర్మ, పరశురామరాజు తదితరులు పాల్గొన్నారు.

జ్యోతిష్యులకు భారత నాస్తిక సమాజం సవాల్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : రాష్ట్రంలో ఎన్నికలు జరిగిన 175 అసెంబ్లీ స్థానాలకు, ప్రస్తుతం జరుగుతున్న దేశంలోని 543 పార్లమెంటు నియోజకవర్గాల్లో ఏ పార్టీ ఎన్ని స్థానాల్లో, ఏయే స్థానాలలో గెలుస్తుందో, స్వతంత్ర అభ్యర్థులు ఎక్కడెక్కడ గెలుస్తారో ఫలితాలు వెలువడక ముందే కచ్చితంగా తెలియజేసిన జ్యోతిష్యులకు భారత నాస్తిక సమాజం బహిరంగంగా సన్మానించడమే కాకుండా రూ.10 లక్షలు అందిస్తామని, అంతేకాకుండా జ్యోతిష్యం నిజమని నమ్మి ప్రచారం చేస్తామని, ఒక వేళ చెప్పలేకపోతే జ్యోతిష్యం తప్పని ఒప్పుకునే ధైర్యం జ్యోతిష్యులకు ఉందా అని భారత నాస్తిక సమాజం కేంద్ర కమిటీ సభ్యులు జె.రవి, టి.శ్రీరామమూర్తి ప్రశ్నించారు. ఈ మేరకు ఒక ప్రకటనలో బహిరంగ సవాల్ విసిరారు. 1975లోనే ప్రపంచంలోని 175 మంది శాస్త్రవేత్తలు జ్యోతిష్యం అబద్ధమని తెలియజేస్తూ ఒక ప్రకటన విడుదల చేశారన్నారు. అందులో 19 మంది నోబుల్ బహుమతి పొందిన శాస్త్రవేత్తలు కూడా ఉన్నారని తెలిపారు. గ్రహాలు భూమి మీద ఉన్న మానవుని మీద ప్రభావం చూపుతాయని మాయ మాటలు చెప్పి ప్రజల అజ్ఞానాన్ని, మూఢనమ్మకాలని ఆసరా చేసుకొని జ్యోతిష్యులు సొమ్ము చేసుకుంటున్నారని విమర్శించారు. ఈ మాయగాళ్ల ఉచ్చులో విద్యావంతులు, మేధావులు కూడా ఉండడం ఆశ్చర్యం కలిగిస్తుందని పేర్కొన్నారు. సైన్సును ప్రోత్సహించాల్సిన ప్రభుత్వాలు ఈ మోసగాళ్లపట్ల కఠినంగా వ్యవహరించాలన్నారు. భారత రాజ్యాంగం ఆర్టికల్ 51 ఎ (హెచ్) ప్రకారం శాస్త్రీయ స్పృహను, మానవవాదాన్ని, సంస్కరణను, పరిశీలనాతత్వాన్ని పెంపొందించడం ప్రతి భారతీయుని విధి అని ఈ సందర్భంగా గుర్తు చేశారు. సవాల్ స్వీకరించే జ్యోతిష్యులు 9866078486 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

సుందరయ్య అడుగుజాడల్లో పయనించాలి



సుందరయ్య చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి- కె.కోటపాడు

దక్షిణ భారతదేశ కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య కుల వివక్షకు వ్యతిరేకంగా అనేక పోరాటాలు నిర్వహించారని, ప్రతి ఒక్కరూ ఆయన అడుగు జాడాలలో పయనించాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) జిల్లా అధ్యక్షులు గాడి ప్రసాద్ పిలుపునిచ్చారు. మండలంలోని కె.సంతపాలెం గ్రామంలో మంగళవారం పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతి వేడుకలు ప్రసాద్ ఆధ్వర్యంలో ఘనంగా నిరసించారు. సుందరయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల అభ్యున్నత కొరకు నిరంతరము కృషి చేసిన మహనీయుడు పుచ్చలపల్లి సుందరయ్య అని తెలిపారు. అణగారిన వర్గాల కొరకు తన యావదాస్తిని ధారాదత్తం చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాగేటి గంగరాజు, బి అప్పారావు, పి భవాని, పలువురు స్థానికులు పాల్గొన్నారు.

విశాఖ రామ్‌నగర్‌లో...

విశాఖ కలెక్టరేట్ : కమ్యూనిస్టు యోధుడు పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి కార్యక్రమాన్ని భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో రామ్‌నగర్‌లో మంగళవారం నిర్వహించారు. సిఐటియు జగదాంబ జోన్ నాయకులు ఎం.సుబ్బారావు అధ్యక్షతన సభ జరిగింది. సుందరయ్య చిత్రపటానికి భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు నాయుడు, సూరప్పారావు పూలమాల వేసి నివాళ్లర్పించారు. కె.నరసింగరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సిఐటియు జగదాంబ జోన్ కార్యదర్శి కెవిపి.చంద్రమౌళి మాట్లాడుతూ సుందరయ్య జీవితం అందరికీ ఆదర్శనీయమన్నారు.



విశాఖలో నివాళులర్పిస్తున్న భవన నిర్మాణ కార్మిక సంఘం నేతలు



సంగీత శిక్షణలో పాల్గొన్న విద్యార్థులు

'కల్యాణి' ఆధ్వర్యాన వేసవి శిక్షణ తరగతులు

ప్రజాశక్తి-అనకాపల్లి

అనకాపల్లి 'కళ్యాణి అకాడమీ ఆఫ్ ఆర్ట్స్' ఆధ్వర్యాన వేసవి శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు అకాడమీ వ్యవస్థాపకులు ఇంద్రగంటి లక్ష్మీ శ్రీనివాస్ తెలిపారు. ఇందులో భాగంగా సంగీతం, కూచిపూడి నాట్యం, వెస్ట్రన్ డ్యాన్స్, డ్రాయింగ్, పెయింటింగ్, కీబోర్డ్, గిటార్లలో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే శిక్షణ అందిస్తున్నట్లు వెల్లడించారు. ఈ శిక్షణా తరగతులలో దాదాపు 160 మంది విద్యార్థులు పాల్గొంటున్నారని తెలిపారు. జూన్ 10వ తేదీన శిక్షణా తరగతుల ముగింపు కార్యక్రమంలో వీరందరికీ సర్టిఫికెట్లు, సినీ ప్రముఖుల అభినందనలతో కూడిన జ్ఞాపిక పత్రాలు అందిస్తామని తెలిపారు.

శ్రీధర్‌కు ఎపి జీవ వైవిధ్య సంరక్షణ అవార్డు

ప్రజాశక్తి-అనకాపల్లి



ఫణి భూషణ్ శ్రీధర్

అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రతి ఏటా మే 22న జీవ వైవిధ్య సంరక్షణపై పనిచేసే వారికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జీవ వైవిధ్య మండలి అందించే అవార్డుకు జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ, వృక్షమిత్ర అవార్డుల గ్రహీత కొణతాల ఫణి భూషణ్ శ్రీధర్ మాస్టర్ ఈ ఏడాది ఎంపికయ్యారు. జీవ వైవిధ్య సంరక్షణ, పర్యావరణ పరిరక్షణపై అనేక కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలను నిత్యం చైతన్య పరుస్తున్న శ్రీధర్ మాస్టారు ఈ అవార్డుకు ఎంపిక కావడం పట్ల పలువురు ఉపాధ్యాయులు, గ్రీన్ క్లబ్ సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రజా సంఘాల నాయకులు అభినందనలు తెలిపారు.

ఎన్నికల ఫలితాలు వచ్చే వరకు 144 సెక్షన్ అమలు

ప్రజాశక్తి బుచ్చయ్యపేట

సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలువడే వరకు ప్రతి గ్రామంలో 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, దీనిని ప్రజలందరూ దృష్టిలో ఉంచుకొని ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసుకోవాలని కొత్తకోట సీఐ అప్పలనాయుడు, బుచ్చయ్యపేట ఎస్ఐ ఈశ్వరరావు కోరారు. బుచ్చయ్యపేట పోలీస్ స్టేషన్ వద్ద మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నలుగురు కంటే ఎక్కువ వ్యక్తులు గుమ్మగూడు ఉండరాదని సూచించారు. ప్రతి పౌరుడు పోలీస్ సిబ్బందికి సహకరించాలని కోరారు.

గ్రామాల్లో ప్రచారం

బుచ్చయ్యపేట : మండలంలోని నీలకంఠాపురం, రాజాం తదితర గ్రామాల్లో మంగళవారం బుచ్చయ్యపేట ఎస్ఐ డి.ఈశ్వరరావు ఆధ్వర్యాన ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాలలోనూ, ఆలయాలు, దుకాణాలు వద్ద ప్రజల గుమిగూడి ఉండవద్దని, శాంతి భద్రతలకు విఘాతం కలక్కుండా ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో హెచ్‌సి అర్జున, కనకరావు తదితరులు పాల్గొన్నారు.



మైక్ ద్వారా ప్రచారం చేస్తున్న పోలీసులు

ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

పరవాడ డిఎస్‌పి కెవి.సత్యనారాయణ

ప్రజాశక్తి-సబ్బవరం

ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని పరవాడ డీఎస్పీ కెవి.సత్యనారాయణ హెచ్చరించారు. మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం సాయంత్రం ఆయన స్థానిక సీఐ పిన్నింటి రమణతో కలిసి బాణసంచా తయారీ కేంద్రాలు, పెట్రోల్ బంకులను సందర్శించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పరవాడ సబ్ డివిజన్ పరిధిలో ఎన్నికలు ప్రశాంతంగా ముగిసేందుకు ప్రజలు సహకరించారని, ఓట్ల లెక్కింపు పూర్తయ్యేవరకూ అదేవిధంగా ఉండాలని కోరారు. ఇప్పటికే గ్రామాల్లో ప్రజలను అప్రమత్తం చేశామన్నారు. పండగలు, శుభకార్యాల్లో స్టేజ్ ప్రోగ్రాములు, ఊరేగింపులు, డీజే సౌండ్లు, బాణసంచా పేలుళ్లు నిషేధించామని తెలిపారు. బెట్టింగ్, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమస్యాత్మక గ్రామాల్లో పెట్రోలింగ్, పికెటింగ్ ఏర్పాటు చేశామన్నారు. రాజకీయ నేతలు సభలు, సమావేశాలు ఏర్పాటుకు తప్పనిసరిగా ఆర్వో అనుమతులు తీసుకోవాలని సూచించారు. కవ్వింపు చర్యలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

టెన్త్, ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షా కేంద్రాల్లో తగిన సౌకర్యాలు

జిల్లా కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి

ప్రజాశక్తి -అనకాపల్లి

ఈనెల 24 నుంచి జూన్ 1వ తేదీ వరకు జరుగు అడ్వాన్స్ సప్లిమెంటరీ పదో తరగతి, ఇంటర్, ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం వారిచే జూన్ 1 నుంచి 8వ తేదీ వరకు జరుగు ఇంటర్ సప్లిమెంటరీ పరీక్ష కేంద్రాల్లో తగిన సౌకర్యాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ రవి పటాన్ శెట్టి సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ మేరకు కలెక్టరేట్ కార్యాలయంలో మంగళవారం వివిధ శాఖల అధికారులతో జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. పదో తరగతి అడ్వాన్స్ సప్లమెంటరీ పరీక్షలు 20 కేంద్రాలలోను, ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లమెంటరీ పరీక్షలు 20 కేంద్రాల్లోనూ, సార్వత్రిక విద్యాపీఠం మూడు పదో తరగతి, ఆరు ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రాల్లోనూ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రతి పరీక్ష కేంద్రంలో తాగునీటి వసతి, వైద్యం, రవాణా సదుపాయం, శానిటేషన్, నిరంతర విద్యుత్తు సరఫరాకు ఎటువంటి అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖాధికారి ఎం వెంకట లక్ష్మమ్మ, జిల్లా వృత్తి విద్య శాఖ అధికారి బి సుజాత పాల్గొన్నారు.

మరో పదేళ్లు హైదరాబాద్‌ను ఉమ్మడి రాజధానిగా కొనసాగించాలి

ప్రజాశక్తి- అనకాపల్లి

హైదరాబాద్‌ను మరో పది సంవత్సరాల పాటు ఉమ్మడి రాజధానిగా కొనసాగించాలని ఉత్తరాంధ్ర చర్చా వేదిక నాయకులు బుద్ధ రాజేష్ డిమాండ్ చేశారు. ఉత్తరాంధ్ర చర్చ వేదిక కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి ఎటువంటి నిర్మాణానికి నోచుకోలేదని తెలిపారు. వైసీపీ ప్రభుత్వంలో మూడు రాజధానుల పేరు చెప్పి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే రాజధాని నిర్మాణం చేపట్టలేదన్నారు. వచ్చే ప్రభుత్వం రాజధాని అమరావతి నిర్మించి ప్రజలకు అందుబాటులో ఉండి పరిశ్రమలు తీసుకువచ్చే వరకు రాబోయే కేంద్ర నూతన ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌కు మరో పది సంవత్సరాలు ఉమ్మడి రాజధానిగా హైదరాబాదు ఉండాలని కోరారు. ఆంధ్ర ప్రదేశ్‌కు హైదరాబాదు నుండి రావాల్సి నిధులు ఆస్తులు సంబంధించి త్వరగా పూర్తి చేయాలని కోరారు. పోలవరం ప్రాజెక్టు నిధులు, ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హెూదా కూడా కేంద్ర కొత్త ప్రభుత్వం ఇవ్వాలని డిమాండ్ చేశారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న బుద్ధ రాజేష్

భారత దేశ తొలి హైడ్రోజన్ నగరంగా విశాఖ

ఐఐపిఇ డైరెక్టర్ ప్రొఫెసర్ శాలివాహన్

ప్రజాశక్తి-సబ్బవరం

భారతదేశపు మొదటి హైడ్రోజన్ నగరంగా అవతరించడానికి విశాఖపట్నం సిద్ధంగా ఉందని ఐఐపిఇ డైరెక్టర్ ప్రొఫెసర్ శాలివాహన్ అన్నారు. ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ (ఐఐపిఈ), యుఎస్ఎలోని స్టోనీ బ్రూక్ విశ్వవిద్యాలయం సంయుక్తంగా విశాఖలోని నొవోటెల్ హోటల్‌లో హైడ్రోజన్ గ్లోబల్ డీకార్బనైజేషన్స్ ఇండో-యుఎస్ వర్క్‌షాప్ మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైడ్రోజన్ ఉత్పత్తి ప్రాజెక్ట్‌కు మద్దతు ఇచ్చినందుకు ఎన్‌టిపిసికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కోర్సు యొక్క ప్రత్యేక ఉద్దేశాన్ని వివరిస్తూ బ్రేక్‌అవుట్ సెషన్లు చర్చలా ఉంటాయని, పాల్గొనేవారు మొదటి మూడు ప్రాధాన్యతలతో ముందుకు రావడానికి ప్రతి రోజు వ్యూహరచన చేస్తారని చెప్పారు. ముఖ్య అతిథి యుఎస్ఎ స్టోనీ బ్రూక్ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ దేవేందర్ మహాజన్ మాట్లాడుతూ "లక్ష్య-ఆధారిత పరిశోధన యొక్క ప్రాముఖ్యతను" నొక్కిచెప్పారు. వినూత్న హైడ్రోజన్ ఉత్పత్తి కార్యక్రమాలకు ఎన్‌టిపిసి-ఐఐపిఇల సహకారాన్ని ప్రశంసించారు. ఎన్‌టిపిసి ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎస్‌కె.సిన్హాతో కండెన్సర్ కూలింగ్ కోసం సముద్రపు నీటిని ఉపయోగించడం, 25 ఎండబ్ల్యూ ఫ్లోటింగ్ సోలార్ ప్యానెల్‌ను ఏర్పాటు చేయడం గురించి చర్చించారు. ఎన్‌టిపిసి 2032 నాటికి 130 జిడబ్ల్యూ కంపెనీగా అవతరించనుందని అంచనా వేశారు. ఎన్‌టిపిసి ప్రాజెక్ట్స్ డైరెక్టర్ యుకె.భట్టాచార్య 1 టిపిడి హైడ్రోజన్ ప్లాంట్, ప్రపంచ శక్తి సవాళ్లను పరిష్కరించడంలో రసాయన, ఎలక్ట్రోకెమికల్ ఇంజనీరింగ్ యొక్క సంభావ్యతను హైలైట్ చేశారు. హైడ్రోజన్ టెక్నాలజీని అభివృద్ధి చేయడంలో, ప్రపంచ ఇంధన లక్ష్యాలను సాధించడంలో పరిశ్రమ-విద్యా భాగస్వామ్యాల కీలక పాత్రను వర్క్ షాప్ నొక్కి చెప్పింది. రిజిస్ట్రార్ రాంఫాల్ ద్వివేది ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు నిర్వాహకులను భాగస్వాములను అభినందించారు.



కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు, నిర్వాహకులు



అనకాపల్లి కాంగ్రెస్ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న దృశ్యం


రాజీవ్‌గాంధీ ఆశయ సాధనకు కృషి

ప్రజాశక్తి-పెందుర్తి

మాజీ ప్రధానమంత్రి, కీర్తిశేషులు రాజీవ్‌గాంధీ ఆశయ సాధన కోసం నేటి యువతీయువకులు కృషిచేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని అనకాపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు విన్నకోట రాము అన్నారు. జివిఎంసి 97వ వార్డు పరిధి చిన్నముసిడివాడ సమీపంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విన్నకోట రాము ఆధ్వర్యాన రాజీవ్ గాంధీ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా విన్నకోట రాము మాట్లాడుతూ, ప్రజా సంక్షేమానికి నిరంతరమూ కృషిచేసిన ఘనత రాజీవ్‌గాంధీకే దక్కిందని కొనియాడారు. భారతదేశ అభివృద్ధికి రాజీవ్‌గాంధీ ఎన్నో ప్రణాళికలు రూపొందించి అమలు చేశారన్నారు. వాటి ఫలితాలు నేటి యువతీయువకులు, ప్రజలు ఆస్వాదిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఆడారి రమేష్‌నాయుడు, పెందుర్తి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముక్క రామునాయుడు, నాయకులు ఆర్ఆర్.నాయుడు, బి.రాంబాబు, టి.విశ్వనాథరావు, కెవి.ప్రసాదరావు, బి.మల్లేశ్వరరావు, ఎమ్.వెంకట్రావు, పి.గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లి : మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ 33వ వర్ధంతి కార్యక్రమం అనకాపల్లి రైల్వే స్టేషన్ రోడ్డు నాయుళ్ల వీధిలో గల కాంగ్రెస్ పార్టీ ఎన్నికల కార్యాలయంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. రాజీవ్ గాంధీ చిత్రపటానికి ఎపిసిసి అధికార ప్రతినిధి ఐఆర్.గంగాధర్ పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతకు 18 సంవత్సరాలకే ఓటు హక్కు కల్పించిన ఘనత రాజీవ్ గాంధీకే దక్కుతుందని చెప్పారు. కేంద్ర నిధులు నేరుగా పంచాయితీ ఖాతాలకు వచ్చే విధానాన్ని ప్రవేశపెట్టింది కూడా రాజీవ్ గాంధీయేనని చెప్పారు. దేశ భవిష్యత్తు కోసం రాజీవ్ గాంధీ ఆశయాలను నెరవేర్చే బాధ్యత కాంగ్రెస్ వాదులపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ అనకాపల్లి పట్టణ అధ్యక్షుడు దాసరి సంతోష్, కసింకోట మండల అధ్యక్షుడు సనేడ గజ్జాలు, జిల్లా కార్యదర్శి ఎగ్గాడ భాస్కరరావు, యూత్ కాంగ్రెస్ నాయకులు కొల్లి సత్యారావు, టి.సంతోష్, మహిళా కాంగ్రెస్ నాయకురాలు ఏడువాకుల దేవుడమ్మ, జూనియర్ న్యాయవాది జయశ్రీ, ఎరుకుల హక్కుల పోరాట కమిటీ అధ్యక్షుడు పూజారి నరసయ్య, ఓరేలా మోహన్ కృష్ణ, వెంకటరమణ పాల్గొన్నారు.

కశింకోట : కశింకోట ప్రధాన రహదారిలో మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ చిత్ర పటానికి కాంగ్రెస్ నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా దేశానికి రాజీవ్ గాంధీ చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో కత్తెర శ్రీధర్, మలపు రెడ్డి కోటేశ్వరరావు, పివన్ దత్తు, బోయిన భానుమూర్తి యాదవ్, తుట్ట రమణ, కాళ్ల సత్యనారాయణ, సేనాపతి రాజు, మాడేపు నాయుడు, బుద్ధ కిషోర్ పాల్గొన్నారు.



కశింకోటలో నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

శిథిలావస్థలో పిఎసిఎస్ భవనం

- పెచ్చులూడుతున్న స్లాబ్
- వర్షానికి కారిపోతున్న వైనం
- బిక్కుబిక్కుమంటూ గడుపుతున్న సిబ్బంది
- పట్టించుకోని పాలకులు, అధికారులు

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట

బుచ్చయ్యపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పిఎసిఎస్) భవనం శిథిలావస్థలో ఉంది. ఏ మాత్రం వర్షం కురిసినా కారిపోతుంది. ఎప్పుడు పెచ్చులూడి పడతాయోనని సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. బుచ్చయ్యపేట పిఎసిఎస్ పరిధిలో బుచ్చయ్యపేట, దిబ్బిడి, పి.భీమవరం, గొన్నవానిపాలెం, కేపీ.అగ్రహారం, ఐతంపూడి, పోలేపల్లి, కందిపూడి, పెద్దమదిన తదితర 14 గ్రామాలకు చెందిన 3,200 మందికి పైగా సభ్యులు ఉన్నారు. రైతుల అవసరాలకు అనుగుణంగా రుణాల మంజూరు, ఎరువులు అమ్మకాలు చేస్తూ ఉంటారు. సంఘ కార్యకలాపాలకు, రైతులకు అవసరమైన ఎరువులు నిల్వ చేసుకోవడానికి, సిబ్బంది విధులు నిర్వహించడానికి, సిబ్బంది నివాసానికి అనుగుణంగా 45 ఏళ్ల క్రితం ఈ భవనాన్ని నిర్మించారు. ఈ భవనం ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకుంది. స్లాబ్ పెచ్చులూడిపోయింది. కొద్దిపాటి వర్షానికే నీరు కారిపోతుంది. దీంతో సిబ్బంది రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. నూతన భవన నిర్మాణానికి పలుమార్లు ప్రతిపాదనలు పంపిన అవన్నీ కాగితాలకే పరిమితమయ్యాయని సిబ్బంది వాపోతున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి కొత్త భవనం నిర్మాణానికి నిధులను మంజూరు చేయాలని రైతులు, సిబ్బంది కోరుతున్నారు.



శిథిలావస్థలో ఉన్న బుచ్చయ్యపేట పిఎసిఎస్ భవనం ఇదే..



భవనం స్లాబ్ పెచ్చులూడిన దృశ్యం

రికార్డుల్లేని పలు వాహనాలు సీజ్

ప్రజాశక్తి-అనకాపల్లి

అనకాపల్లి పట్టణం శివార్లలోని సుబ్రహ్మణ్యం కాలనీ, డిబి కాలనీలో కార్డెన్ అండ్ సెర్చ్ ఆపరేషన్‌లో భాగంగా రికార్డులు లేని పది ద్విచక్ర వాహనాలు, 3 ఆటోలను మంగళవారం అనకాపల్లి పట్టణ పోలీసులు సీజ్ చేశారు. అనకాపల్లి జిల్లా ఎస్పీ కె.వి.మురళీకృష్ణ ఆదేశాల మేరకు అనకాపల్లి సబ్ డివిజన్, అనకాపల్లి టౌన్ ఎస్‌హెచ్ఒ జి.శంకరరావు ఆధ్వర్యంలో ఎస్సైలు సత్యనారాయణ, అలీ షరీఫ్ ఈ చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలువడనున్న సందర్భంగా గ్రామాల్లో ఎటువంటి అల్లర్లు చెలరేగకుండా ప్రశాంత వాతావరణంలో కౌంటింగ్ జరిగే విధంగా పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అనుమానాస్పద ప్రాంతాల్లో ఈ కార్డెన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహిస్తున్నామని చెప్పారు. పట్టణ ప్రజలు ఎటువంటి అసాంఘిక, చట్ట వ్యతిరేక కార్యక్రమాల్లో పాల్గొనరాదని హెచ్చరించారు.

మునగపాక : కార్డ్ అండ్ సెర్చ్ ఆపరేషన్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని నాగులపల్లి గ్రామంలో మంగళవారం ఉదయం నుండి పోలీసులు పెద్ద ఎత్తున మోహరించి గ్రామాన్ని జల్లెడ పట్టారు. రికార్డ్స్ లేని 42 ద్విచక్ర వాహనాలు, ఒక ఆటోను సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఎలమంచిలి సిఐ గఫూర్ మాట్లాడుతూ గ్రామాలలో ఎటువంటి అసాంఘిక, చట్టవ్యతిరేక కార్యక్రమాలలో పాల్గొన్న రాదని హెచ్చరించారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికల కౌంటింగ్ జరిగేందుకు పటిష్ట చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పరవాడ సబ్ డివిజన్, ఎలమంచిలి సర్కిల్ పరిధిలోని పలువురు సిఐలు, ఎస్సైలు, భారీ ఎత్తున పోలీసు బలగాలు పాల్గొన్నారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న వాహనాలు



భోజనాలు వడ్డిస్తున్న టిడిపి నేత దాడి రత్నాకర్ తదితరులు

ఆంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం

ప్రజాశక్తి -అనకాపల్లి

పట్టణంలోని గవరపాలెం విజ్ఞాన సమితి వద్ద ఉన్న ఆంజనేయస్వామి ఆలయం ఏడో వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్, టిడిపి బీసీ సాధికారత సమితి రాష్ట్ర కన్వీనర్ మళ్ల సురేంద్ర ఆలయాన్ని సందర్శించి స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరిని ఆలయ కమిటీ సభ్యులు శాలువతో ఘనంగా సత్కరించారు. అనంతరం ఆలయం వద్ద కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారీ అన్న సమారాధన కార్యక్రమాన్ని దాడి రత్నాకర్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు చందు, కోరుబిల్లి పరి, ఉషా సాగర్, బాలు, మధు, దాడి శ్రీను, లక్ష్మణరావు, పరదేశి నాయుడు, వేగి కృష్ణ, కర్రి మహాలక్ష్మి నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

నిధుల్లేక వెలవెలబోతున్న చలివేంద్రాలు

ప్రజాశక్తి - యలమంచిలి

ఏ ప్రభుత్వం ఉన్నా మున్సిపాలిటీ లాంటి పట్టణాల్లో వేసవి వచ్చిందంటే చాలు చలివేంద్రాలు ఏర్పాటు చేయడం ఆనవాయితీ. దానికి తగ్గట్టు నిధులు కూడా విడుదల చేసేవారు. అయితే ఈ ఏడాది మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మూడు చలి వేంద్రాలు నిధుల లేమితో కనీసం మజ్జిగకు కూడా నోచుకోవడం లేదు. రెండు మట్టి కుండల్లో నీరు పోసి అక్కడ ఓ రెండు గ్లాసులు పడేసి నిర్వహిస్తున్నారు. గత రెండు మూడు సంవత్సరాలుగా నడుస్తున్న చలివేంద్రాలకు ఒక్కో చలివేంద్రానికి 5 లీటర్ల పెరుగును మజ్జిగ చేసి ఒక మనిషిని ఉంచి దాహార్తి తీర్చు వారు. ఈ విధంగా కనీసం ఆరు చలివేంద్రాలకు తక్కువ కాకుండా మున్సిపాలిటీ ఆధ్వర్యంలో నిర్వహించేవారు. అవి కాకుండా పోలీస్, స్వచ్ఛంద సంస్థలు విడిగా మరి కొన్ని చలివేంద్రాలు నిర్వహించేవారు. ఈ ఏడాది ఎన్నికల హడావుడి కావడంతో అధికారులంతా ఎన్నికల పనుల్లో మునిగిపోయి, చలివేంద్రాల సంగతి మరచిపోయారు. స్వచ్ఛంద సంస్థలూ ముందుకు రాలేదు. పర్యావసానంగా దాహంతో పాదచారులు ఎండ వేడిమికి తట్టుకోలేక సతమతమౌతున్నారు. రోడ్డున పోయే ప్రయాణీకులకు సేద తీరే అవకాశం లేకుండా పోయింది.

అధికారులు వివరణ

'గతంలో వేసవిలో చలివేంద్రాల నిర్వహణకు జిల్లా కలెక్టర్ నిధులు కేటాయించేవారు. ఈ ఏడాది అటువంటి విధానమేదీ ప్రకటించలేదు. నిధుల లేమితో మజ్జిగ కేంద్రాలు నిర్వహించలేకపోతున్నాం. నామమాత్రపు జనరల్ నిధులతో మూడు చలివేంద్రాల ద్వారా మంచినీటిని మాత్రమే అందిస్తున్నాం.' అంటూ మున్సిపల్ అధికార్లు వివరణ ఇచ్చారు.



మున్సిపల్ కార్యాలయం ముందు ఉన్న చలి వేంద్రం

అటకెక్కిన 'జలజీవన్ మిషన్'

- పథకం అమలులో నిండా నిర్లక్ష్యం
- ఇంటింటికీ కుళాయిలు హుళక్కే...
- నీరుగారిన కేంద్ర ప్రభుత్వ లక్ష్యం
- పట్టించుకోని అధికార యంత్రాంగం
- తాగునీటికి అవస్థలు పడుతున్న జనం



చౌడపల్లి సచివాలయం ఆవరణలో తుప్పలలో పడి ఉన్న పైపులు

ప్రజాశక్తి -అచ్యుతాపురం : ఇంటింటికి కుళాయిలను వేసి రక్షిత మంచినీరు అందించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వ జలజీవన్ మిషన్ పథక ఆశయం మండలంలో నీరుగారింది. ఈ పథకంలో మండలంలో చౌడపల్లి. గొర్లి, ధర్మవరం. అప్పలకొండాపురం గ్రామాల్లో ఇంటింటికీ కుళాయిలు మంజూరుకు జలజీవన్ మిషన్ కింద 2022 డిసెంబర్ నెలలో కేంద్ర ప్రభుత్వ పథకం మంజూరు చేసింది. చౌడపల్లి పంచాయతీలో ఐదు కిలోమీటర్ల పొడవునా ఇంటింటికి కుళాయిలు వేసేందుకు రూ.79.84లక్షలతో బడ్జెట్ ప్రతిపాదన చేశారు. వీటిలో సగం మొత్తాన్ని రాష్ట్రప్రభుత్వం, మిగతా కేంద్ర ప్రభుత్వం కేటాయించాల్సి ఉంది.

పనులు చేయడానికి అధికారులు టెండర్లు పిలిచినప్పటికీ ఎవరు ముందుకు రాలేదు. దీంతో కొన్నాళ్లపాటు ఎదురుచూసి, చివరకు స్థానికంగా ఉన్న కాంట్రాక్టర్లతో ఈఏడాది ఫిబ్రవరి 28న అగ్రిమెంటు కుదిర్చారు. ఒప్పందం కుదుర్చుకున్న కాంట్రాక్టర్ నల్లపైపులు తీసుకొచ్చి సచివాలయం వద్ద పడేసాడు. రాష్ట్ర ప్రభుత్వం మొదట విడతగా ఇవ్వాల్సిన నిధులు మంజూరు కాకపోవడంతో కాంట్రాక్టర్ పనులకు ముందుకు రాలేదు. దీంతో కాంట్రాక్టరు తెచ్చిన పైపులు చౌడువాడ సచివాలయ వద్ద తుప్పలలో పడి ఉన్నాయి. రెండేళ్లక్రితం జలజీవన్ మిషన్ కింద ఇంటింటికీ కుళాయిలను ప్రతిపాదించినప్పటికీ, పథకం అమలులో పాలకులు, అధికారుల నిర్లక్ష్యం వల్ల ముందుకు సాగని పరిస్థితి ఉంది. దీంతో ఆయా గ్రామాల్లో ఇంటింటికీ సురక్షిత కుళాయి నీరు పక్కన బెడితే, గడచిన రెండేళ్లలో వేసవి సీజన్‌లో తాగునీటికి ప్రజలు తీవ్ర అవస్థలు పడే పరిస్థితులున్నాయి.

మరోవైపు గొర్లి ధర్మవరం పంచాయతీలో ఏడు కిలోమీటర్ల పొడవునా పైప్‌లైన్ వేసి ఒక ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మించారు. దాని ద్వారా ఇంటింటికీ కుళాయిలు వేయాల్సి ఉంది. ఆ పనులకు రూ. 92.70లక్షలను కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ ప్రతిపాదన చేసి పనులు చేయడానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. అలాగే అప్పలకొండ కొరము గ్రామంలో నిర్మించి రూ.55 లక్షల ఖర్చుతో ఇంటింటికి కుళాయి పనులు మంజూరైనా, నేటికీ s పనులు ప్రారంభం కాలేదు. అభివృద్ధి పనులు చేయడానికి కాంట్రాక్టర్లు పోటీపడి గతంలో టెండర్లు వేసేవారు. నేడు ఆ పరిస్థితి కాన రాలేదు. చేసిన పనులకు సకాలంలో బిల్లులు వస్తాయనే నమ్మకం లేకకాంట్రాక్టర్ ముందుకు రావడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారయంత్రాంగం స్పందించి, జలజీవన్ మిషన్ కింద ఇంటింటికీ కుళాయి ఏర్పాటు పనులు మంజూరైనా గ్రామాల్లో వెంటనే పనులు చేపట్టి నీటి కష్టాల నుంచి ప్రజలకు విముక్తి కల్పించాలని పలువురు కోరుతున్నారు.

నర్సీపట్నం మున్సిపాలిటీలో కార్డెన్ సెర్చ్



పోలీసులు సీజ్ చేసిన పత్రాలు లేని వాహనాలు

ప్రజాశక్తి-అనకాపల్లి డెస్క్ : ఎన్నికల ఫలితాలు వెలువడే వరకు అందరూ అప్రమత్తంగా ఉండాలని నర్సీపట్నం డిఎస్‌పి మోహన్ సూచించారు. మంగళవారం ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా నర్సీపట్నం మున్సిపాలిటీలో కార్డన్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఎలాంటి పత్రాలు లేకుండా ఉన్న 68 ద్విచక్ర వాహనాలను, ఆటో, కారు, బొలెరో వాహనాలను గుర్తించి, పోలీస్ స్టేషన్‌కు తరలించి సీజ్ చేశారు. ఈసందర్భంగా డిఎస్‌పి మోహన్ మాట్లాడుతూ, ఇప్పటికే రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ నిర్వహించామని, ఎలాంటి అల్లర్లకు పాల్పడినా కఠినచర్యలు తప్పవని హెచ్చరించామన్నారు. ఎన్నికల ఫలితాలపై బెట్టింగులు నిర్వహించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రస్తుతం ఎన్నికల కోడ్‌తోపాటు సిఆర్‌పిసి 144 సెక్షన్, పోలీస్‌యాక్ట్ సెక్షన్ 30 అమలులో ఉందన్నారు. ఎట్టిపరిస్థితుల్లోనూ నలుగురికి మించి గుమిగూడి ఉండరాదన్నారు. రాజకీయపార్టీల ప్రతినిధులు, ప్రజలు అర్థం చేసుకొని పోలీసులకు సహకరించాలని డిఎస్‌పి మోహన్ కోరారు.

ఘనంగా మోదమ్మ ఘటాల ఊరేగింపు



ఘటాల ఊరేగింపులో పాల్గొన్న ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు

ప్రజాశక్తి - మాడుగుల: మాడుగుల మోదకొండమ్మ అమ్మవారి ఘటాల ఊరేగింపు ఘనంగా జరిగింది. మంగళవారం ఉదయం అమ్మవారి ఘటాలు మోదకొండమ్మ ఆలయం నుండి పురవీధులలో ఊరేగిస్తూ 10.15గంటలకు కోట వద్ద గల శతకంపట్టు వద్దకు చేర్చి, గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో కొలువుదీర్చారు. కార్యక్రమంలో మాడుగుల మోదకొండమ్మ ఆలయ చైర్మన్ పుప్పాల అప్పలరాజు, కమిటీ సభ్యులు, పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వైద్యసేవల్లో నిర్లక్ష్యం ఆరోపణలపై విచారణ



బాధిత కుటుంబీకులను విచారిస్తున్న డాక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి-గొలుగొండ : లింగంపేటలో ఆర్ఎంపి వైద్యుడి నిర్లక్ష్య వైద్యసేవలతో నెల్లూరి సత్యనారాయణ అనే వ్యక్తి మృతి చెందాడన్న ఆరోపణలపై జిల్లా కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి, డిఎంఅండ్‌హెచ్‌ఒ డాక్టర్ హేమంత్ ఆదేశాల మేరకు జిల్లా ఆరోగ్యశాఖ ప్రత్యేకాధికారి, నాతవరం ఇన్‌ఛార్జి వైద్యాధికారి డాక్టర్ ప్రశాంతి విచారణ చేపట్టారు. ముందుగా కృష్ణదేవిపేట ఆర్ఎంపి వైద్యులు రామదాసును తన బృందంతో వెళ్లి విచారించారు. సత్యనారాయణకు అందించిన వైద్యసేవలపై వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా సత్యనారాయణకు తాను ఒక్క రోజు మాత్రమే వైద్యసేవలు అందించానని ఆర్ఎంపి వైద్యుడు వివరించాడు.. పచ్చకామెర్లకు వైద్యసేవలు అందించడంపై ఆర్ఎంపి వైద్యుడిని ప్రశ్నించారు ప్రాథమిక చికిత్స చేసి పంపించాల్సిన రోగులను, ఇన్‌పేషెంట్లుగా చేర్పించి వైద్యసేవలు అందిస్తున్న పరిస్థితులను గమనించి, ప్రశ్నించి, వివరాలు రాబట్టారు. అనంతరం లింగంపేటలో మృతుని ఇంటికి వెళ్లి అతని భార్య రమణమ్మను, కుమార్తె సత్యలతో మాట్లాడి, సత్యనారాయణకు అందించిన వైద్యసేవలపై ఆరా తీశారు. ఆర్ఎంపి వైద్యుడు రామదాసు మూడు రోజుల పాటు సత్యనారాయణకు వైద్యసేవలు అందించారని కుటుంబ సభ్యులు చెప్పగా వివరాలు నమోదు చేసుకున్నారు. ఈసందర్భంగా విలేకర్లతో మాట్లాడుతూ, జిల్లా అధికారుల మేరకు విచారణ చేశానని, సేకరించిన అంశాలను నివేదిక రూపంలో డిఎంఅండ్‌హెచ్‌ఒ, జిల్లా కలెక్టర్‌కు అందిస్తామన్నారు. వారి ఆదేశాల మేరకు తదుపరి చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో గొలుగొండ పిహెచ్‌సి వైద్యాధికారి శ్యామ్ కుమార్, కేడిపేట పిహెచ్‌సి వైద్యాధికారి హరిప్రవీణ్, క్షేత్ర స్థాయి సిబ్బంది పాల్గొన్నారు.

విజ్ఞానదాయకంగా వేసవి శిక్షణ శిబిరాలు



నర్సీపట్నంలో వేసవి విజ్ఞాన శిబిరంలో పాల్గొన్న చిన్నారులు

మండల కేంద్రాల్లోని శాఖా గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాలు ఉత్సాహంగా సాగుతున్నాయి. వచ్చేనెల 7వ తేదివరకు నిర్వహించే ఈ శిబిరాలకు పిల్లలు, విద్యార్థులు వస్తున్నారు. ఆటపాటలతోపాటు చదువుకు సంబంధించి వివిధ అంశాల్లో నిర్వహిస్తున్న పోటీల్లో ఉత్సాహంగా పాల్గొంటున్నారు.

(ప్రజాశక్తి విలేకర్ల యంత్రాంగం)

యలమంచిలి : యలమంచిలి శాఖా గ్రంథాలయంలో సమ్మర్ క్యాంప్‌లో భాగంగా మంగళవారం విద్యార్థులకు ఇంగ్లీష్ గ్రామర్, నీతి కథలు, జనరల్ నాలెడ్జి విభాగంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. పాఠశాల విద్యార్థులు వేసవి సెలవుల్ని ఆటవిడుపుగా గడపకుండా కాస్త కలిసోచ్చే విద్యార్జన చేయాలన్నదే లక్ష్యంగా ఈ క్యాంపు నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయాధికారి వి.ఆనంద్ తెలిపారు. విద్యార్థులకు అవసరమైన మరెన్నో కార్యక్రమాలు రూపొందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో రిటైర్ట్ ఉపాధ్యాయులు వై.అప్పారావు, ఫిజకల్ డైరెక్టరు కె.దుర్గారావు పాల్గొన్నారు.

సబ్బవరం : స్థానిక శాఖ గ్రంథాలయంలో విద్యార్థులకు వేసవి శిక్షణా శిబిరంలో భాగంగా మంగళవారం కథలు చెప్పడం, వార్తా పత్రికల పఠనం, చదరంగం ఆటలు నిర్వహించినట్లు గ్రంథాలయాధికారి వి.కుమారి శిరీష తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పుస్తక పఠనం, ఆటల వలన విద్యార్థులు మేధోసంపతిని పెంపొందించుకోవచ్చని చెప్పారు. ఈ శిబిరంలో పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

మాడుగుల : మాడుగుల మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా మంగళవారం లైబ్రేరియన్ వై. వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో విద్యార్డులకు పుస్తకాలు చదవటం, కథలు చెప్పడం, జికె, స్పోకెన్ ఇంగ్లీష్, డ్రాయింగ్ మొదలైన అంశాల్లో శిక్షణనిన్నున్నారు. ఆయా కార్యక్రమాల్లో చిన్నారులను భాగస్వాములను చేస్తుండడంతో వారు సైతం ఉత్సాహంగా పాల్గొంటున్నారు. వచ్చేనెల 7న వేసవి విజ్ఞాన శిబిరాల ముగింపులో వివిధ అంశాల్లో విజేతలకు బహుమతులను అందజేస్తామని లైబ్రేరియన్ వెంకటేశ్వర్లు తెలిపారు.



సబ్బవరంలో చదరంగం నేర్చుకుంటున్న చిన్నారులు

గొలుగొండ : గ్రంథాలయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని గొలుగొండ ఎఎస్ఐ పూర్ణచంద్రరావు సూచించారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి రాజుబాబు ఆధ్వర్యంలో వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా మంగళవారం బుక్ రీడింగ్, స్టోరీ టెల్లింగ్, చైర్ గేమ్ నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎఎస్ఐ పూర్ణచంద్రరావు మాట్లాడుతూ విద్యార్థులు క్రమం తప్పకుండా గ్రంథాలయానికి వచ్చే అలవాటు చేసుకోవాలని సూచించారు.. గ్రంథాలయాలకు రావడం వల్ల విజ్ఞానం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అనకాపల్లి డెస్క్ : నర్సీపట్నం శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి పి.దమయంతి ఆధ్వర్యంలో మంగళవారం సమ్మర్ క్యాంపు నిర్వహించారు. రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత పి.ప్రభాకర్ పాల్గొని, కృషి, పటుట్దల ఉంటే ఎంత పనినైనా సాధించవచ్చునని కథ రూపంలో వివరించారు. రీసోర్స్ పర్సన్ సిహెచ్.భవానీ విద్యార్థులకు రాష్ట్రాలు, వాటి రాజధానులు చెప్పించారు. కొమరవోలు జెడ్‌పిహెచ్ఎస్ సోషల్ అసిస్టెంట్ సిహెచ్.రాంకుమార్ పెద్దల పట్ల ఎలా మెలగాలి, భవిష్యత్‌లో వృద్ధాశ్రమాలు లేని పరిస్థితులు రావాలంటే నేటితరం యువత, పిల్లల బాధ్యతను వివరించారు. బలిఘట్టం జెడ్‌పివాచ్ఎస్ డ్రాయింగ్ మాస్టర్ శ్రీనివాస్ ఒక చిత్రాన్ని వేసి ఎలా వేయాలో మెలుకువలు నేర్పించారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే కఠినచర్యలు



మాట్లాడుతున్న ఎస్ఐ కృష్ణారావు

ప్రజాశక్తి-గొలుగొండ : గొలుగొండ పోలీసుస్టేషన్ పరిధిలోని సమస్యాత్మక గ్రామాలకు చెందిన కొంతమంది వ్యక్తులతో మంగళవారం సాయంత్రం గొలుగొండ ఎస్ఐ బి.కృష్ణారావు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల ఫలితాలు కౌంటింగ్ రోజును ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ముందస్తుగా పోలీసు స్టేషన్‌లో కౌన్సిలింగ్ ఇచ్చామని, ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే కఠినమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు,

ఉపాధిని నిర్వీర్యం చేస్తున్నారు..

- వ్యవసాయ కార్మికసంఘం

ప్రజాశక్తి- అనకాపల్లి డెస్క్ : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి బడ్జెట్‌లో నిధులు కేటాయింపులు తగ్గించడంతోపాటు కూలీలకు పని కల్పించకుండా వలసలు పోయే పరిస్థితులను కల్పించి ఈ పథకాన్ని నిర్వీర్యం చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చూస్తున్నాయనిఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మాకిరెడ్డి రామునాయుడు ధ్వజమెత్తారు. చేసిన పనులకు బిల్లులు చెల్లించడం లేదని, ఉపాధిపనిప్రదేశంలో కనీసం సౌకర్యాలు కల్పించడం లేదని విమర్శించారు.

మంగళవారం నర్సీపట్నం మండలం ఓ.లక్ష్మీపురం గ్రామంలో ఉపాధి హామీ పనులు చేస్తున్న కార్మికులతో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సభ్యులు సమావేశమయ్యారు.

ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి మాకిరెడ్డి రామునాయుడు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఉపాధి కూలీల బడ్జెట్ గతం కంటే తగ్గించుకుంటూ వస్తూ గ్రామాలలో ఉన్న కూలీలకు ఉపాధి అవకాశం లేకుండా, వలసలు పోయేలా చేస్తోందన్నారు. వేసవిలో మండుటెండలో ఉపాధి పని చేస్తున్నప్పటికీ పని దగ్గర టెంట్ గాని, నీరు మజ్జిగ పనిసమయంలో ప్రమాదాలు గురైన పట్టించుకోకుండా ప్రథమ చికిత్స సదుపాయం లేకుండా చేస్తుందన్నారు.

ఉపాధి పనిదినాలను ఏడాదికి 200కు పెంచాలని, రోజుకు సగటు వేతనం కూలీకి రూ.600 చొప్పున చెల్లించాలని, అర్హులైన వారందరికీ ఉపాధి పని కల్పించడంతోపాటు, పని ప్రదేశంలో మరణిస్తే రూ.20 లక్షల పరిహారం ఇచ్చి బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు వెలుగుల అర్జునరావు, ఉపాధ్యక్షుడు చోడే శ్రీనివాస్‌చౌదరి, రైతుసంఘం జిల్లా నాయకులు గొల్లు గురుబాబు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

క్షయవ్యాధి నిర్మూలనకు బీసీజీ వ్యాక్సినేషన్

ప్రజాశక్తి-మధురవాడ : టీబీ వ్యాధి నిర్మూలనకు ప్రతి గురువారమూ మధురవాడ, ఆనందపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్న సచివాలయాల్లోనూ, హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్లలో బీసీజీ వ్యాక్సిన్ ప్రతి గురువారమూ అందుబాటులో ఉంటుందని మధురవాడ టీబీ యూనిట్ సీనియర్ టీబీ ల్యాబ్ సూపర్‌వైజర్ వి.వీరబ్రహ్మాం తెలిపారు.

ఐదేళ్ల క్రితం టీబీ వచ్చిన తగ్గిపోయిన వారు, 18 ఏళ్లు నిండిన వారు, పొగ తాగేవారు, సుగర్ వ్యాధి గ్రస్తులు, బాడీ మాస్ ఇండెక్స్ 18 కన్నా తక్కువ ఉన్నవారు, టీబీ రోగులతో దగ్గరి సంబంధం ఉన్న వారు బీసీజీ వ్యాక్సిన్ వేయించుకోవాలని ఆయన కోరారు. మధురవాడ టీబీ యూనిట్ పరిధిలో ఉన్న సాగర్‌నగర్, రుషికొండ, పిఎం పాలెం, వాంబే కాలనీ, స్వతంత్ర నగర్, మిథులాపూర్, విశాలాక్షి నగర్, మారికవలస, బక్కన్నపాలెంలోని యుపిహెచ్‌సిల్లో, సచివాలయాల్లో బీసీజీ వ్యాక్సిన్ అందుబాటులో ఉంటుందని తెలిపారు. బీసీజీ వ్యాక్సిన్ వేయించుకుంటే టీబీ బారిన పడకుండా ఉంటారని వివరించారు.

అన్నసమారాధన



అన్న సమారాధనలో భోజనాలు చేస్తున్న భక్తులు

ప్రజాశక్తి -నక్కపల్లి : మండలంలోని వెదుళ్ళపాలెం గ్రామంలో ఆంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. వార్షికోత్సవం పురస్కరించుకుని ఆలయం వద్ద సామూహిక కుంకుమ పూజ నిర్వహించారు భారీగా మహిళలు తరలివచ్చి కుంకుమ పూజలో పాల్గొన్నారు. ఆలయం వద్ద మధ్యాహ్నం భారీ అన్న సమారాధన చేపట్టారు. ఆలయ వార్షికోత్సవం సందర్భంగా ఆలయానికి రంగులు వేసి పూల అలంకరణతో అందంగా ముస్తాబు చేశారు.

పచ్చిరొట్ట విత్తనాల సాగుతో మేలు

ప్రజాశక్తి - మాడుగుల: పచ్చిరొట్ట విత్తనాల సాగుతో పొలాల్లో భూసారం పెరగడం, ఇతరత్రా ప్రయోజనాలున్నాయని మండల వ్యవసాయాధికారి ఎం.వాసుదేవరావు సూచించారు. ప్రస్తుతం ప్రభుత్వం ద్వారా సగం రాయితీ ధరపై రైతుభరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉండే విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో వ్యవసాయ పనులకు అనుకూల వాతావరణం ఏర్పడిందని, రైతులు దీన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మే నెలలో మాడుగుల మండలంలో గడచిన 20 రోజులలో 9 రోజులపాటు వర్షపాతం నమోదైందని, సాధారణ వర్షపాతం 120 మిల్లీ మీటర్లు కాగా, మేనెలలో ఇప్పటికే 98 మిల్లీమీటర్ల వర్షం కురిసిందన్నారు. వేసవి దుక్కులకు, ముందస్తు ఖరీఫ్ పనులకు ఈ వర్షాలు ఎంతో అనుకూలమన్నారు. ఖరీఫ్‌లో వరిసాగు చేసే పంట పొలాల్లో పచ్చిరొట్ట విత్తనాలను పెంచి, వాటిని దమ్ములో కలియ దున్నడం ద్వారా భూసారం పెరగడంతోపాటు ఆరోగ్యకరమైన పంట దిగుబడులు, ఎరువుల పెట్టుబడి వ్యయం తగ్గుతుందన్నారు. జీలుగు, కట్టిజనుము, పిల్లి పెసర వంటి పచ్చిరొట్ట విత్తనాలు రాయితీపై అందుబాటులో ఉన్నాయన్నారు. అవసరమైన రైతులు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డు తీసుకొని తమ గ్రామంలోని రైతు భరోసా కేంద్ర సిబ్బందిని సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. రెండు నుంచి మూడు రోజులలో విత్తనాభివృద్ధి సంస్థ నుండి విత్తనాలు తెప్పించి అందజేస్తామన్నారు. జీలుగు, కట్టి జనుము విత్తనాలు కిలో ధర రూ.88కాగా, రూ.44కు సగం ధరకే పొందవచ్చన్నారు. అలాగే ,పిల్లి పెసర ఒక కేజీ పూర్తి ధర రూ.134కాగా, రాయితీ పోను రైతులు రూ.67 చెల్లిస్తే పొందవచ్చన్నారు.

అధ్వాన రహదారితో అవస్థలు

- దుమ్ము, ధూళిమయంలో రాజుపేట రోడ్డు
- రాకపోకలకు ప్రజలు, వాహనదారుల ఇక్కట్లు
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు
- క్వారీ వాహనాల వల్లే ఇబ్బందులని ప్రజల గగ్గోలు

ప్రజాశక్తి-కోటవురట్ల : మండలంలో రాజపేట రహదారి అధ్వానంగా తయారైంది. గడిచిన ఐదేళ్లలో కనీసం ఎటువంటి నిర్వహణ, మరమ్మతులు చేపట్టకపోవడంతో రోడ్డంతా పూర్తిగా రూపు కోల్పోయి, గోతుల మయమై ప్రజలు, వాహనదారులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. దీనిపై అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా వారు పట్టించుకోలేదని స్థానిక సర్పంచ్ వెంకటరమణ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు, రాజుపేట నుంచి విశాఖపట్నం వైపు, అలాగే జిల్లా కేంద్రం అనకాపల్లి, మాకవరం పాలెం వెళ్లేందుకు దగ్గర దారి కావడంతో నిత్యం ఈ మార్గంలో అధికసంఖ్యలో వాహన రాకపోకలతో రద్దీగా ఉంటుంది. ఇలాంటి ప్రాధాన్యత ఉన్న రహదారి గోతులమయం కావడంతో ప్రధానంగా ద్విచక్ర వాహనదారులు సహా రైతులు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. ఈ మార్గంలో ప్రయాణిస్తే దుమ్ముధూళి రేగి, కళ్ళల్లో పడడంతో ఇబ్బంది పడుతున్నారు, రాత్రి సమయంలో ప్రమాదాలు సైతం చోటుచేసుకుంటున్నాయి,

ఇక్కడ సమీపంలో క్వారీ ఉండడంతో , క్వారీ వాహనాల రాకపోకలకు వీలుగా రోడ్డుపై నిత్యం దుమ్ము లేవకుండాకొన్ని ప్రాంతాలలో నీళ్ల పిచికారి చేస్తుండడంతో దాని ప్రభావంతో తాత్కాలికంగా ధూళి సమస్య తగ్గుతున్నా, తడిసిన రోడ్డుపై భారీ వాహనాల రాకపోకలతో ఇపుడు రోడ్డంతా పూర్తిగా ధ్వంసమైపోయిందనే ఆరోపణలున్నాయి. క్వారీ నిర్వాహకులు గోతుల ప్రదేశంలో క్వారీ రబ్బిస్ వేయడంతో ద్విచక్ర వాహనాలు మలుపుల వద్ద అదుపుతప్పి, ప్రమాదాల పాలైన ఘటనలు సైతం చోటు చేసుకుంటున్నాయి. క్వారీ నుంచి భారీ వాహనాలు పరిమితికి మించి అధికలోడుతో ప్రయాణించడంతో రోడ్లన్నీ చిద్రమైపోతున్నాయని అధికారులు, నేతలకు తెలిసినా, దీనిపై స్థానికుల ఎన్నోసార్లు గగ్గోలు పెట్టినా తమకేమీ పట్టనట్లు వ్యవహరించడంతో ప్రస్తుత రోడ్డు దుస్థితికి కారణమని స్థానికులు మండిపడుతన్నారు. , పలుమార్లు మైన్స్ సహా సంబంధిత శాఖ అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకోలేదని సర్పంచ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు, ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, రహదారిని బాగుపరచాలని, అధిక లోడుతో ప్రయాణించే వాహనాలను అరికట్టాలని కోరుకుంటున్నారు.



పూర్తిగా రూపుకోల్పోయిన రాజుపేట రహదారి



నిండా గోతులమయమైన రాజుపేట రోడ్డు

రోలుగుంటలో ఎసిబి సోదాల కలకలం

ప్రజాశక్తి-రోలుగుంట : మండల కేంద్రంలోని సంతబయలు వీధిలో మంగళవారం ఎసిబి సోదాలు కలకలం రేపాయి. తెలంగాణా రాష్ట్రం హైదరాబాద్‌లో సిసిఎస్ విభాగంలో ఎఎస్‌పిగా పని చేస్తున్న ఉమామహేశ్వర రావుపై ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నారన్న ఆరోపణలపై అతని బంధువుల ఇంట్లో ఆ రాష్ట్ర ఎసిబి అధికారులు కేసు నమోదు చేశారు. ఏకకాలంలో ఆయనతోపాటు ఆయన బంధువులు, స్నేహితుల ఇళ్లలో సోదాలు నిర్వహించారు. ఇందులో భాగంగా రోలుగుంటలోని సంతబయలు వీధిలో ఉన్న మడ్డు తమ్మునాయుడు ఇంట్లో సోదాలు చేపట్టారు. మంగళవారం ఉదయమే ఎపి డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ స్టేట్ ట్యాక్స్ జిఎస్‌టి బోర్డులతో ఉన్న కార్లు, పోలీసుశాఖకు చెందిన బోర్డుతో ఉన్న కారులో రెండు బృందాలుగా ఎసిబి అధికారులు వచ్చారు. స్థానిక కార్యాలయం వద్దకు చేరుకొని కారులను అక్కడే ఉంచి, స్థానిక పంచాయతీ కార్యాలయం సిబ్బందిని వాకబు చేశారు. వారి సహాయంతో మడ్డు తమ్మునాయుడు ఇంటి వద్దకు చేరుకొని మధ్యాహ్నం వరకు సోదాలు చేశారు. మడ్డు తమ్మునాయుడు కుమారుడు మడ్డు జోగినాయుడు స్పెషల్ పార్టీ పోలీసుశాఖలో కానిస్టేబుల్‌గా పని చేస్తున్నాడు. ప్రస్తుతం విశాఖ సింహాచలం దేవస్థానం వద్ద సెక్యూరిటీ విభాగంలో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు.



సోదాలు చేస్తున్న ఎసిబి అధికారులు